యేసుక్రీస్తు అందరికి ప్రభువు ★ "Registered" VSP / 142 / 2018- 2020

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

₹ : 5

CHRISTAVANAADU
TELUGU FORTNIGHTLY REGD. NEWS PAPER
PUBLISHED FROM VISAKHAPATNAM

ఎడిటర్ : వై.కనకరాజు

Br Y Kanaka Raju : 7981542666 / 9346960601
Br Y L Raviraju : 9985656511 | Br Y Dhana Raju : 9866113513

RNI APTEL / 2006 / 17980
CHRISTAVANAADU
Post Box No. : 2
AdarshNagar(Po)
Visakhapatnam - 530 040

Website : christavanaadu.weebly.com
christavanaadu@gmail.com | christavanadu@gmail.com
christavanaadu1@yahoo.co.in
facebook: christavanaadu

సంపుటి : 12 సంచిక : 14 2018 మార్చి 1-15 పేజీలు : 8


దేవుని వాక్యమే సత్యము.. సకలాశీర్వాదాలకు కారణం. ఆ వాక్యమే 'క్రైస్తవనాడు' కు ఆయుధం. అందుకు దేవునికి స్తోత్రము.

**సత్యవాక్య పోరాటంలో... 12వ, సంవత్సరం.**




కోరికలు కోరి ఆరాధించేవారు బిజినెస్‌మెనే గాని భక్తుడు కాడు

- డా.కందాడై రామానుజాచార్యులు




మానవత్వం నీలో కనబడితే - నీలో ఉన్న దైవత్వాన్ని ఇతరులు గమనించగలరు.

- ప్రొ.శామ్ కుమార్
విశాఖపట్నం



దెయ్యం కంటె భయం మహా చెడ్డది

- సునీల్
(అతడు చిత్రంలో)



## నీతిమంతుడు

అతని (పిలాతు) భార్య–నీవు ఆ 'నీతిమంతుని' జోలికిపోవద్దు..★

ప్రపంచ చరిత్రలో ఎందరో మహానుభావులను గురించి చదువుతాం. అందు శూరులు, ధీరులు, ధర్మాత్ములు, మత ప్రభోధకులు, పద్య, గద్య, నిష్ణాతులు, నిష్టాగరిష్టులు, త్యాగశీలురు, సేవాతత్పరత గలవారెందరో ఉన్నారు. ఇది జగమెరిగిన నిజం. వారందరిలో యేసుక్రీస్తుదో ప్రత్యేకతన్నది సత్యదూరంగాదు. ఆయనే చరిత్రకు మూల పురుషుడైనారు. ఆయన పేరట చరిత్ర క్రీస్తుపూర్వంగాను, క్రీస్తుశకంగాను విభజింపబడింది. దాన్ని బట్టే ప్రపంచం నడుస్తోందన్నది కాదనలేని నిజం. అయితే పరిశుద్ధ గ్రంథంనందు ఆయనను 'నీతిమంతుని'గా చూడగలం. 2లో

'సిలువనుగూర్చిన వార్త, నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి' - 1కొరింథీ.1:18

అందరూ ఆహ్వానితులే!

సికింద్రాబాద్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ వేదికగా
ఫిబ్రవరి 19 నుండి మార్చి 30 వరకు
ప్రతిరోజు ఉదయం 4గం॥ల నుండి 7గం॥ల వరకు
**'నా ప్రియుని ప్రత్యేకతలు'** అనే అంశంపై



డా.జాయ్ చెరియన్ ప్రత్యేక ప్రసంగాలు!

(యు.పి.ఎఫ్. రాంనగర్ చర్చ్ నుండి సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ వరకు బస్సు సౌకర్యము కలదు)

## ఢిల్లీ పాలనపై కేసియార్ ఆగ్రహం!



తెలంగాణ ముఖ్య మంత్రి కెసియార్ జాతీయ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్‌లపై ఆగ్రహం వ్యక్తపరచారు. రాష్ట్రాలపై కేంద్రం కనబర్చే సవతి ప్రేమను తూర్పార బట్టారు. తెలుగు రాష్ట్రాల విభజన జరిగి నాలుగేండ్లు పూర్తైనా అనేక రకాలుగా హామీలు కేంద్రం నెరవేర్చలేదన్నారు. ఇలా ఏ దేశంలోనూ చూడలేమన్నారు. రాష్ట్రాలకు కేంద్రం ఇవ్వాల్సింది ఇవ్వాలి లేదా ఇవ్వలేమనైనా చెప్పాలి. అలా చేయకుండా ఈ నాన్చుడు ధోరణి తగదన్నారు. దేవుడు సహకరిస్తే మూడో ఫ్రంట్ ఏర్పాటుకేగాక నాయకత్వం వహించడానికి వెనుకాడనన్నారు. ఆంధ్రకు ఇవ్వాల్సిన హామీలను తుంగలోకి తొక్కడాన్ని ప్రశ్నించడంవల్ల ఆంధ్రప్రదేశ్ నాయకులు, ప్రజలు కేసియార్‌ను కొనియాడుతున్నారు. కెసియార్ పట్టుదల చూసిన తెలుగు రాష్ట్రాల్లోనేగాక ఇతర రాష్ట్రాల అధినాయకులు, నాయకుల్లో సహితం కెసియార్‌కు మద్దతు లభించుట ఇప్పుడు దేశంలో హాట్‌టాపిక్‌గా మారింది. రాబోవు రోజుల్లో కెసియార్ ప్రణాళికలేంటో.. ఏం జరగనుందో వేచి చూడాల్సిందే!



## పాస్టర్ ప్రవీణ్ దుర్బోధ!

● తమపై వస్తున్న విమర్శలు ఎదుర్కోడానికి ఇస్కరియోతు యూదాను అడ్డుపెట్టుకోజూస్తున్న వైనం హాస్యాస్పదం!

● అందుకు సంబంధించిన వీడియో వాట్సాప్‌లో హల్‌చల్!

● పరిశుద్ధ గ్రంథాన్ని చదివి, ధ్యానించే సమయం లేకపోవడమే అందుకు కారణమా?

● తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతానికి అదో హట్ టాపిక్‌గా మారింది.

(వివరాలు వచ్చేసంచికలో)





మానవునిలో గుప్తమైన దేవుని ఖజానా 2లో

మీ వెలుగు





యేసుక్రీస్తు సిలువ సందేశం 4లో

ప్రకటన గ్రంథము



ఆధ్యాత్మిక విజ్ఞాన ధారావాహిక - 1
అభ్యర్థన – ఆచరణ – ఆశీర్వాదము 5&6


తిండిపోతు తనము 6&7





6లో 'క్రైస్తవనాడు' ఆర్టికల్స్‌పై బిషప్ కె.జాన్ దేవదాస్ స్పందన!

## ఎస్.విజయప్రసాద్ రెడ్డికి తప్పిన ముప్పు!




తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురం కేంద్రంగా పరిచర్య చేస్తున్న ఎస్.విజయప్రసాద్ రెడ్డి బోధ చేసేందుకు ప్రయాణిస్తున్నప్పుడు కారు చక్రం ఊడిపోయిందని తెలిసింది. అందువల్ల చాలా పెద్ద ప్రమాదమే జరిగి ప్రాణాలకే ముప్పు వాటిల్లేదని, కాని దేవుని కృపవల్ల ఆయన రక్షించబడ్డారనీ వారి అనుయాయులు చెబుతున్నారు. ఊడిన చక్రం అతి వేగంగా వెళ్లి ప్రక్కనున్న ఓ ఇంటిలోనున్న బిందెకు తగిలింది.. ఆ బిందె రెండు ముక్కలైంది. అదే ఆ ప్రక్కనున్న మామ్మకు తగిలుంటే పరిస్థితి ఎలా ఉండేదో తలచుకుంటేనే భయమేస్తోందంటున్నారు దాన్ని చూసిన, విన్నవారు. ఏదేమైనా సేవలో మరింత 'జాగ్రత్తగా' విజయప్రసాద్ రెడ్డి ఉండాలని పలువురు హెచ్చరిస్తూ.. హితవుపలుకుతున్నారు.

తెలంగాణ

## బుధేరా ప్రాంతంలో సేవచేస్తున్న పాస్టర్ ఆశారాజ్ ఇకలేరు!



సంగారెడ్డి జిల్లా, తెలంగాణ : పాస్టర్ ఆశారాజ్ బుధేరా ప్రాంతంలో సంఘ కాపరిగా సేవలందిస్తున్నా.. జిల్లా వ్యాప్తంగా సేవకుల పరిచయాలున్న వారు. వారు అందరితోను కలుపుగోరుతనంగా ఉంటూ సేవ జరిగించేవారు. 2012లో 'క్రైస్తవనాడు' పేపరు ఎడిటర్ బ్రదర్ వై.కనకరాజు కుటుంబానికి పరిచయమయ్యారు. ఆ క్రమంలోనే.. ఎడిటర్ పెద్ద కుమారుడు బ్రదర్ వై.లీలా రవిరాజు వివాహాన్ని పాస్టర్ ఆశారాజ్ సంఘంలోనే జరిపించారు. ఆ విధంగా ఎడిటర్ కుటుంబీకులకు పరిచయమై మరణం వరకు తన స్నేహాన్ని కొనసాగించారు. వారు ఇక లేరన్న విషయం విన్న ఎడిటర్ అల్లుడు మరియు సదాశివపేటలో సేవ చేస్తున్న బ్రదర్ ఎ.ప్రేమ్‌కుమార్, శివలక్ష్మి దంపతులతోబాటు ఎడిటర్ కుటుంబీకులూ జీర్ణించుకోలేకున్నారు. తమ పెద్దకుమారుని వివాహాన్ని అన్నీ తానే అయి ఆయన జరిపిన విధానాన్ని గుర్తుచేసుకొంటూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఎడిటర్ దంపతులు. వారి కుటుంబానికి ప్రభువే ఆదరణ చూపుతారని భరోసాను వ్యక్తపరచారు. సేవకులు విశ్వాసులు హాజరై పాస్టర్ ఆశారాజ్ యెడల తమకున్న ప్రేమను చాటారు. తమ స్నేహబంధాన్ని అందరికీ కనబర్చారు. అందరి మన్ననలను పొందిన ఆశారాజ్ సేవలు చిరస్మరణీయాలు అని వారు భావించారు.




*(మొదటిపేజీ తరువాయి)* ఇలా ఓ వ్యక్తిని గురించి నీతిమంతుడని ఆ వ్యక్తి చరిత్రను తెలుపుతూ వ్రాయబడిన మరో పుస్తకం లోకంలో ఎక్కడా లేదంటారు క్రైస్తవపండితులు. యేసుక్రీస్తు 'నీతి మంతుడు'. ఇది పరిశుద్ధ గ్రంథ సాక్ష్యం. అందుకు సంబంధించిన కొంత వివరణే మీరిప్పుడు చదువబోయే 'నీతిమంతుడు'. ఒకరిని గురించి ఇంకొకరు చెప్పేదే సాక్ష్యం. అలాగే ఒకరిని గురించి మరొకరైనా, సంస్థలైనా, నాయకులైనా, పాలకులైనా ఇచ్చే కితాబు ఎన్నదగినదైయుంటుంది. ఇక బిరుదుల గురించి చెప్పనక్కరేలేదు. లోకంలో ఎన్నో రకాలుగా ఉన్నతంగా జీవించే వారిని గురించి ఎంతో గౌరవించి మాట్లాడుట మనకు తెల్సిందే. ఎంత గౌరవించినా ఎదుటి వ్యక్తిని గురించి 'నీతిమంతుడు' అని చెప్పేందుకు సాహసించుట బహుకష్టతరం. చరిత్ర కలబోసిన గ్రంథం పరిశుద్ధ గ్రంథంలో మాత్రం 'నీతిమంతుడు' అని ప్రభువైన యేసుక్రీస్తుని గురించి వ్రాయబడింది. అదే పరిశుద్ధ గ్రంథం చాలామందిని నీతిమంతులంటుంది. వారికి యేసుకి మధ్య ఉన్న తేడా ప్రత్యేకమైంది.

దేవుడు చాలా మందిని వారి వారి క్రియలను బట్టి నీతిమంతులుగా పరిశుద్ధ గ్రంథం ద్వారా సాక్ష్యమిచ్చారు. అందు నోవాహు నుంచి అబ్రహాము తదితరులెందరో పాత నిబంధనలో కన్పడతారు. మరియ భర్త, యేసు తండ్రియైన యోసేపు మొదలుకొని క్రీస్తుని నమ్మిన వారందరిని గురించి నీతిమంతులని దేవుడు ఇచ్చిన సాక్ష్యాన్ని ఆ యా గ్రంథ రచయితలు నూతన నిబంధనలో వ్రాసారు. పాత, క్రొత్త నిబంధనల్లో కన్పడే నీతిమంతులు దేవుని వలన బహిరంగ పర్చబడ్డారు. ఇది క్రైస్తవులకు ఆశ్చర్యానందాలను కల్గించే విషయం. అందుకు పరిశుద్ధ గ్రంథంలో వ్రాయబడిన వాటిపై వారికి పట్టుండాలి.

ఓ వ్యక్తిని గురించి మరోవ్యక్తి 'నీతిమంతుడు' అని 'పూర్ణ మనస్సుతో' సాక్ష్యమివ్వలేడన్నది ఎంతైనా నమ్మదగిందే. ఈ విషయం ముందే చెప్పుకున్నాం. యేసుక్రీస్తు మాత్రం అందుకు భిన్నం. అదెట్లు అన్పిస్తుందా?! యేసుక్రీస్తు సర్వమానవాళి పాపక్షమాపణ కొరకు రక్తం చిందించే సమయం ఆసన్నమైనప్పుడు జరిగిన ఓ సంభవమే అందుకు సాక్ష్యం. ఆయన 'నీతిమంతుడు' అని సాక్షమిచ్చి పలికినది సామాన్యురాలు కాదన్నది గమనార్హం. యేసుని శిక్షించే లేక విడిచిపెట్టే అధికారం కల్గిన వ్యక్తికి భార్య. ఓ ఘనురాలు యేసుని 'నీతిమంతుడు' అని సాక్ష్యమిచ్చినట్లు చరిత్రలో ఎవరిని గురించి ఎవరూ సాక్ష్యమివ్వలేదన్నది అనేకమంది క్రైస్తవపండితుల అభిప్రాయం. మన స్నేహితులైనా, తుదకు కుటుంబీకులైనా మన గురించి పూర్ణ మనస్సుతో నీతిమంతులమని చెప్పగలరా అని ఎవరికి వారే ప్రశ్నించుకుంటే చాలు! జవాబు దొరికేస్తుంది. ఓ ఘనురాలైన స్త్రీ యేసుని గురించి చెప్పిన దేవుని మాటతో ఈ వివరణ మొదలైంది.'నీతిమంతుడు' అని యేసుని గురించి ఆసాంతం వ్రాయబడిందేమీరిప్పటి వరకు చదివారు.

'నీతిమంతుడు' యేసుక్రీస్తు అని పరిశుద్ధ గ్రంథం బయల్పరచిన విధానం అపూర్వం. ఆ 'నీతిమంతుడు' చిందించిన రక్తమే మాబోటి కోట్లాదిమందిని 'నీతిమంతులు'గా మార్చిందన్న పరిశుద్ధ గ్రంథం సాక్ష్యమే. ఈ వచనం...

**ఆయన కృపచేతనే, క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా, నిర్హేతుకముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు.** ★

యేసుక్రీస్తుని నమ్మిన వారియెడల దేవుడు ఏర్పరచిన ఆ ప్రణాళిక ఆయన ఉచిత కృప సుమా! మేం కోరలేదు. మా పుట్టుకకు వేల సంవత్సరాల క్రితమే జరిగిన సంభవమది. అట్టి ఉచిత కృపకు అందరూ అర్హులే! కేవలం యేసుక్రీస్తుని నమ్మితేచాలు, ఆ కృప లభ్యం! నమ్మాలంటే ఆచార వ్యవహారాలతో కాదుగాని, పరిశుద్ధ గ్రంథం చెప్పినదాన్ని చదివి, గ్రహించి ఆచరించాలి. అందు మూఢభక్తికి, మతమార్పిడికి తావేలేదు.

యేసుని నమ్మాలంటే కేవలం మనస్సు మారుటే. మతం మారుట కాదన్నదిపరిశుద్ధ గ్రంథంను, అందున్న దేవుని సంకల్పాన్ని ఎరిగిన వారిమాట. మతం మనిషికి సంబంధించినది. హృదయం దేవునిది. అది మంచితోనిండాలి. ఆ మంచి దేవుని మాటలే గావాలి. ఆ మాటలు పరిశుద్ధ గ్రంథంలో సంపూర్ణం. అందుకు సాక్ష్యంగా యేసుక్రీస్తు దేవుడొక్కడే 'మంచివాడు' అన్నారు. దాన్ని కాదనగల ఆస్తికులుంటారా?! ఉండరుగాక ఉండరు. అందువల్ల మంచివాని మాటలు ఆయనకు చెందిన మన హృదయాల్లోనిండాలి. హృదయం నిండినదానిబట్టి నోరు మాట్లాడుతుందని యేసు లోకానికి చెప్పారందుకే. మన హృదయాలు ఆ యా మాటలతో నిండుతుండాలి.. భావితరాలకు అవి దిశా నిర్దేశాలుగావాలి. అట్టి ఘనమైన వాక్యాలున్న పరిశుద్ధ గ్రంథం ద్వారా బ్రతుకుల్ని దిన దినం ప్రభావితం చేస్తూ మంచి పౌరులుగా తన'లోకాన' జీవింపజేస్తున్న 'దేవునికి స్తోత్రము' అని క్రైస్తవులు స్తుతిస్తూనే ఉన్నారు.. ఉంటారు. లోకాన అలా జీవింపజేస్తూ, మరణాంతరం 'పరలోకాన' చేర్చే దేవున్నే మేం కలిగున్నామన్న నిరీక్షణతో జీవించే క్రైస్తవజీవితాలు లోకస్తులను ఆలోచింపజేయగలగాలి. అలా జీవిస్తేనే 'దేవుని పని' మన శరీరాల్లో మనం నెరవేర్చినట్లు. ఇది పరిశుద్ధ గ్రంథం దేవుని మనసెరిగిన వారి మాట. క్రైస్తవులందరికి ఇది శిరోధార్యమవాలి. అప్పుడే యేసుక్రీస్తు 'నీతిమంతుడు' అన్పించుకున్నట్లే మనం కూడా నీతిమంతులమని 'నరలోకాన' అన్పించుకోగలం.

యేసుని బట్టి నీతిమంతులమని 'పరలోక' సాక్ష్యం మనకుండనే ఉంది. 'పరలోక' 'నరలోక' సాక్ష్యాలు రెండూగల క్రైస్తవ జీవితాలెంతో ధన్యకరములు. అట్టి జీవితాలు మనకు, మన మాటలు విన్న అందరికీ 'కడవరకు' ఉండేలా ప్రార్థిద్దాం.. సువార్త ప్రకటిద్దాం. నీతిమంతుడైన 'దేవునికి స్తోత్రము'.

పరిశుద్ధ గ్రంథంలోగల ఇటువంటి అనేక నిగూఢాంశములను పాఠములుగా నేర్చుకునే అవకాశం కోసం 'క్రైస్తవనాడు'ను ఉత్తరాల ద్వారా సంప్రదించండి. దేవున్ని 'ఎరుగుటయే' నిత్యజీవం జాగ్రత్త సుమా! అపుడే సకలాశీర్వాదాలకు మన శరీరం నిలయమౌతుంది. అందుక్కారణం.. వాక్యరూపాన ఉన్న దేవుడే మనలో నిండుతుంటారు కాబట్టి. ఇది పరిశుద్ధ గ్రంథమిచ్చే భరోసా. పొందేందుకు క్రైస్తవులందరూ పరిశుద్ధ గ్రంథం చదివి గ్రహించి ఆచరణలో చూపాలి.

క్రైస్తవనాడు పేపర్లో పతాక శీర్షికలుగా తొలినాళ్లనుంచి తండ్రియైన దేవుని, ప్రభువైన యేసుని అనేక పేర్లతో మహిమ పరుస్తున్నప్పుడు ఇతరుల గ్రంథాల, విశ్వాసాల జోలికి వెళ్లడంలేదు. తద్వారా అనవసర వివాదాలకు దూరంగా ఉంటున్నాం. ఇది సువార్త ప్రకటనలో 'క్రైస్తవనాడు' తొలినాళ్లనుంచీ చూపుతున్న మాదిరి. ఆ విధంగా అనేకులకు సువార్త ప్రకటిస్తున్నాం. ఇది క్రైస్తవనాడు ఒరవడి. మరిన్ని రాసేట్లు మీ కుటుంబ ప్రార్థనల్లో గుర్తు చేసుకోగలరని కోరుతున్నాం -ఎడిటర్.

# మానవునిలో గుప్తమైన దేవుని ఖజానా


రెవ.టి.ఎ.ప్రభుకిరణ్
హైద్రాబాద్

**ఆ**కలిలేని వానికి అన్నం రుచి తెలియదు. ఆపదలో పడితే తప్ప దేవుని శక్తి, మంచితనం మనకు అర్థం కాదు. అందుకే యెహోవా ఉత్తముడని రుచిచూచి తెలుసుకోవాలని బైబిల్ చెప్తోంది (కీర్తనలు 34:8) మన శక్తికి, అంచనాలకు మించిన పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడే దేవుని ఔన్నత్యమేమిటో మనకు అర్థమవుతుంది. యూదా రాజైన యెహోషాపాతు, అతని ప్రజలు ఒకసారి ఇదే పరిస్థితినెదుర్కొన్నారు. యూదా దేశం మీదికి నాలుగు దేశాలు కలిసికట్టుగా నాలుగువైపుల నుండి ఒకేసారి దురాక్రమణ చేసాయి. (2దిన. 20:1,2), లోకంలోని దిక్కులన్నీ మూసుకుపోయినా చేతులెత్తి పరలోకంలోని దేవుని ప్రార్థించడానికి అనువుగా ఉన్న పై దిక్కును మాత్రం ఏ శత్రువూ మూసివేయలేడన్న రహస్యాన్ని ఎరిగిన వాడుగా యెహోషాపాతు ఆ మార్గాన్నే అనుసరించాడు. 'మా శక్తి చాలదు, నీవే మాకు దిక్కు' అంటూ ఆయన చేసిన ప్రార్థనకు జవాబుగా దేవుడు, 'భయపడవద్దు. పోరాడనవసరం లేకుండానే మీరు గెలుస్తారు' అని అభయమిచ్చాడు. సరిగ్గా అలాగే జరిగింది. యూదా ప్రజలు రణరంగంలో దేవుణ్ణి పాటలతో స్తుతిస్తూండగా, చుట్టూ ఉన్న శత్రుసైనికుల మధ్య విభేదాలు రగిలి వారు ఒకరినొకరు చంపుకున్నారు. ఆ సాయంత్రానికే అనూహ్యమైన విజయం దేవుని ప్రజలకు దక్కింది.

మనం అధిగమించలేనివిగా కనిపించే కొండల్లాంటి సమస్యలు, దేవుని దృష్టిలో గులకరాళ్ళ కన్నా చిన్నవి అన్నది తెలుసుకోవడమే నిజమైన విశ్వాసం. దేవుడు మన ప్రతి పరిస్థితికీ చాలినవాడని నమ్మడమే తొలి అడుగుగా మన విశ్వాస యాత్ర ఆరంభమవుతుంది. అపుడు ఆ యాత్రలో ఎదురయ్యే ప్రతి అనుభవమూ 'దైవ ప్రేరేపితమేనని, మన మేలునకుద్దేశించబడినదే' అని బోధపడుతుంది (రోమా 8:28). దేవునితో మనకున్న అనుబంధం, సహజీవనం కొనసాగే కొద్దీ అనేక అమూల్య సత్యాలు అర్థమవుతుంటాయి. ఆయన చేతిలో చేయివేసి చేసే ప్రయాణంలో మనకు అనేక పారమార్థిక సత్యాలు బోధపడతాయి. విమాన ప్రయాణం చేయడానికి, విమానం ఎగరడానికి సంబంధించిన సాంకేతిక విషయాలన్నీ మనకు తెలియనవసరం లేదు. ఆ విమానాన్ని నడిపే వ్యక్తికి అంటే పైలట్‌కు అదంతా తెలుసునన్న విశ్వాసం మాత్రం మనకు ఉంటే చాలు. బాల్య స్థాయి నుండి ప్రారంభమయ్యే మన విశ్వాసయాత్ర, మన జీవితాల్లో దేవున్ని సంపూర్ణంగా విశ్వసించి విధేయత ప్రకటించే అత్యున్నత స్థాయికి చేరుకోవాలి. దైవ మానవ సంబంధాల్లో ప్రశ్నలకు తావు లేదు. తన బరువుకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ బరువున్న పదార్థాన్ని అవలీలగా దొర్లించుకుపోయే చీమను ఎప్పుడైనా చూశారా? చీమలకన్నా ఎంతో ఉన్నతంగా, అపురూపంగా సృష్టించబడిన మానవుడిలో దేవుడు ఇంకా ఎన్నెన్నో అద్భుత శక్తులను, సృజనాత్మకతను గుప్తం చేసి ఉంచాడు. నిజానికి వాటన్నింటికీ ప్రాప్తిస్థానం దేవుడే. ఆయన పిల్లలుగా వాటన్నింటికీ వారసులం కూడామనమే!

# మీ వెలుగు

**మ**నుషులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచనట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి.

ఒక క్రైస్తవ రైతు వద్దకు శ్రీను పాలేరుగా చేరాడు. 3నెలలు పని చేసిన తరువాత శ్రీను "అయ్యగారూ! నేను మీ వద్ద పని మానివేస్తున్నాను" అన్నాడు. శ్రీను పని బాగా నచ్చిన ఆ రైతు "ఎందుకు మానివేస్తున్నావు?" అని ఆదుర్దాగా అడిగాడు. "నేను రేపటినుండి ఆయన వద్దకు పని చేయడానికి వస్తానని సుబ్బారావు గారికి మాట ఇచ్చాను" అని అన్నాడు. రైతు "ఆయన దగ్గర ఎందుకు? సుబ్బారావు నా కంటే ఎక్కువ జీతమ ఇస్తాడా?" అని అడిగాడు. "లేదండీ మీరు ఇచ్చినంతే ఇస్తానని అన్నారు" అన్నాడు శ్రీను.


డా.పి.బి.మనోహర్
తెనాలి

అప్పుడు రైతు "అలాగైతే మానివేయుట ఎందుకు? నీకు జీతము సరిపోకపోతే ఆ మాట చెప్పు. నేను వంద రూపాయలు పెంచుతాను" అన్నాడు. "జీతము కొరకు కాదండీ! కాని నేను సుబ్బారావు గారి దగ్గర పని చేయాలని అనుకొంటున్నాను" అన్నాడు. శ్రీను పని నచ్చిన రైతుకు అతను వెళ్లిపోవుట బాగా దు:ఖము కలిగించింది. అతనితో "సర్లే నీకు జీతము రెండు వందలు పెంచుతాను ఇక్కడే ఉండు" అన్నాడు.


అప్పుడు శ్రీను "అయ్యా! జీతము సమస్య కాదండీ! నాకు క్రైస్తవ మతము మంచిదా? హిందూ మతము మంచిదా? అనే సందేహము వచ్చింది. మూడు నెలలు మీ దగ్గర పనిచేసాను. క్రైస్తవులు ఎలా ప్రవర్తిస్తారో మీ దగ్గర తెలుసుకొన్నాను. మరొక 3 నెలలు సుబ్బారావు వద్ద పని చేస్తాను. ఆయన ఎలా ప్రవర్తిస్తాడో గమనిస్తాను. 3 నెలల తరువాత షేక్ జానీ గారి వద్ద పని చేస్తాను. మీ ముగ్గురిలో ఎవరి ప్రవర్తన నాకు నచ్చుతుందో ఆ మతాన్ని స్వీకరించాలని నేను అనుకొన్నాను" అని శ్రీను వెళ్లిపోయాడు.

రైతుకు చాల దు:ఖము కలిగింది. శ్రీనుతో తాను కఠినముగా ప్రవర్తించిన సన్నివేశములు జ్ఞాపకముకు వచ్చినవి. ఎంత పొరపాటు చేసాను. అయినా శ్రీను ఈ విషయము నాకు ముందుగా చెప్తే జాగ్రత్తగా ఉండేవాడిని కదా? అని దు:ఖపడ్డాడు.

మన మాటల కంటే మన ప్రవర్తన ఇతరులపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది. ఇతరులు మనలో క్రీస్తును చూడగలిగితే మనము మంచి సువార్తికులము. మీ వెలుగు ఇతరుల వద్ద ప్రకాశించుచున్నదా?

క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



బ్రదర్ వై కనకరాజు (హోలీ బైబిలిస్ట్)

# తృప్తి...కలిగుండాలి!

ఉన్నదాంట్లోనే తృప్తికలిగుండాలని అందరూ చెప్పేవారే! కాని ఆచరించేవారే అతి తక్కువ. నిజానికి ప్రతి మనిషి అలానే తృప్తిచెందడం మొదలెడ్తే పురోగతి అక్కడితోనే ఆగిపోయుండేదన్నది నిజం! ఎందరో మహానుభావులు ఉన్నవాటితోనే సరిపెట్టుకోక సాటిమానవులకు మరింకేదైనా మేలు చెయ్యాలని ఆశించారు. వారి కృషి ఫలితంగానే మన తరం వారందరూ ఎన్నో ప్రయోజనకరమైన వస్తువులను, వైజ్ఞానిక పరికరాలను చూడగలిగాం, ఇకముందు కూడా మరెన్నో చూడగలం. అట్టివాటినెన్నిటినో కనిపెట్టి రాబోయే తరాలకు అందించిన మహానుభావులను ఈ సమయంలో ఓ సారి తలంచుకొని కృతజ్ఞతలర్పిద్దాం. అయితే వారు ఉన్నవాటితో తృప్తిచెందలేదంటే కారణం.... దానికో అర్థం పరమార్థం ఉన్నాయని, వారి అసంతృప్తే మరెన్నో ఆవిష్కరణలకు నాంది పలికిందని మనకు తెలుసు. వారు సాటివారికోరకు మేలైనవి అందించారు. అలా అందించుటకు ఆ యా సమయాల్లో వారి దగ్గరున్న వనరులనే వినియోగించుకున్నారు. వాటితోనే తృప్తి చెంది రాబోవు తరాలకు అనుహ్యమైన వాటిని అందించారు. వారి తృప్తిలో సంతృప్తి కనబడుతుంది. వారి అసంతృప్తి తర్వాతి తరాలకు దీవెనగా మారింది. ఆలోచిస్తే ఇందెంతో గొప్ప విషయంగా కన్పడుతుంది. మరి నేటి దినాల్లో మనిషి తృప్తి దేంట్లో చెందాలి? అసంతృప్తి దేంట్లో చెందాలి? అన్నది ఆలోచించాలి!

(ఇది మునుపటిదే. పాఠకుల కోరికపై కొద్దిపాటి మార్పులతో మరోసారి ఇవ్వడమైనది!)

"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము..... మా కొరకు ప్రార్థించుడి"

**గమనిక** అనేకమంది చందాదారులు, ప్రకటన కర్తల సూచనపై 'క్రైస్తవనాడు' స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెంబరు ఇస్తున్నాం. ఇది 'క్రైస్తవనాడు' సబ్ - ఎడిటర్ మరియు డిజైనర్ బ్రదర్ వై.ధనరాజు కు సంబంధించినది. చందాదారులు, ప్రకటనకర్తలు తమ సౌకర్యాన్ని బట్టి ఈ క్రింది అకౌంట్‌లలో సొమ్ము జమచేయొచ్చని తెలియజేస్తున్నాం. - ఎడిటర్

**CHRISTAVANAADU**
**Andhra Bank**
***Current A/C* : 13 96 111 00 00 00 52**
IFS Code : ANDB0001396
Adarsha Nagar Branch, Visakhapatnam

**Y.DHANA RAJU**
**State Bank of India**
**S/B A/c No.: 34513409917**
IFS Code : SBIN0010602
Vishalakshi Nagar, Visakhapatnam

సం॥ చందా ₹ 200. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు **ఉచితం!** చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం బాధ్యత వహించలేం. చందాలు, ప్రకటనలకు సంబంధించిన సొమ్ముకు తగు రసీదు వెంటనే తీసుకొని 7981542666 / 9866113513 నంబర్లకు ఫోన్ చేయండి.

మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలు, అలాగే మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి. ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగబోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరలా రప్పించును. ★


'క్రైస్తవనాడు'లో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రుల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే, పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

ఎడిటర్ కుటుంబీకులు వ్రాస్తున్న వివరణలన్నీ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం. కాబట్టి రాబోవు సంచికలను మిస్ కాకండి.

'వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న పరిశుద్ధ గ్రంథ వాక్యాన్ని బట్టి 'క్రైస్తవనాడు' స్వరచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

'క్రైస్తవనాడు' విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి. మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి. మీ పరిచర్యా వివరాలు తెలిపి ప్రచురింపజేసుకోండి.

'క్రైస్తవనాడు' - ఆధ్యాత్మిక, రాజకీయ, సామాజికంగా సంచలనాత్మక వివరణలు, వార్తలు, విశ్లేషణలతో లక్షలాది క్రైస్తవులకు మరియు ఇతరులకు పరిచయమైన పేరు!




రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము. ★
వచ్చుతరము తెలిసికొనునట్లుగా ఇది వ్రాయబడవలెను సృజింపబడబోవు జనము యెహోవాను స్తుతించును. ★
ఈ మాటలు నమ్మకమును నిజమునైయున్నది గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు. ★

'యథార్థ' రాతల్లో దమ్మున్న పేపరని పాఠకులిస్తున్న సాక్ష్యాన్ని బట్టి 'దేవునికి స్తోత్రం'.

## దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం

హోలీ బైబిల్ / దేవుని మాట × సైన్స్ / శాస్త్రజ్ఞుల మాట

బ్రదర్ వై.లీలా రవిరాజు



# బిడ్డలకు బైబిలునిస్తే బ్రతుకును దేవుడిస్తారు

**'నేడు నేను నీకాజ్ఞాపించు ఈ మాటలు నీ హృదయములో ఉండవలెను. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింట కూర్చుండునప్పుడును త్రోవను నడుచునప్పుడును పండుకొనునప్పుడును లేచునప్పుడును వాటినిగూర్చి మాటలాడవలెను'.** ★

నేటి సమాజంలో అనేకులు తమ పిల్లలను సక్రమంగా పెంచుతున్నామని అనుకుంటుంటారు. లోకంలో ఘనంగా ఉండాలని వారి పిల్లలను పెంచుతున్నారే గాని దేనిని అనుసరిస్తే పిల్లలు ఘనులవుతారో వారు ఎరుగకపోవడం ఒకింత ఆశ్చర్యమే. ప్రతి ఒక్కరు లోకంలో ఘనులవలేరు. ఒకరు ఒక విషయంలో ఘనంగా ఉంటే వారిని తలదన్నేవారు మరొకరు వస్తున్నారు. వచ్చినవారు గొప్పవారా? అని ఆలోచిస్తే వారినీ తలదన్నే వారు ఇంకొకరు వస్తుంటారు. ఇలా చూసుకుంటూపోతే లోకంలో ఒకరిని మించి మరొకరు పుడుతూనే ఉంటారు. అయినా సరే వారి ఘనత భూమి మీద కొంతకాలానికి మరిచిపోవుట సహజం. అందువలన దానిని ఘనతగా భావించుట సమంజసం కాదు. ఘనత అనేదినిత్యమైనదైయుండాలి. ఎవరూ మరువనిదైయుండాలి. ఇవి పిల్లలకు ఉండాలంటే కేవలం దేవునిలోనే సాధ్యం. దీనికి యేసుక్రీస్తువారే మనకు ప్రత్యక్ష ఉదాహరణగా లోకానికి సాక్షిగా ఉన్నారనుట అతిశయోక్తి కాదు. ఆయన తల్లిదండ్రులు ఆయన్ను దేవునిలో పెంచుట ద్వారా ఆయన దేవుని మార్గంలో నడచుట వలన దేవుడే ఆయనను శకపురుషునిగా చేసారన్నది మన నమ్మకం. అది మనకెంతో ఆదరణను కల్గిస్తూ సంతోషింపజేస్తుంది. ఆయన పుట్టి ఇప్పటికి సుమారు 2017 సంవత్సరాలు గడిచాయి. ఇప్పటికైనా, మరెప్పటికైనా ఆయనను తలదన్నే వారు వుండరన్నది జగద్విదితం. ఘనతంటే అలా ఉండాలి. అది దేవుడు మాత్రమే ఇవ్వగలిగే ఘనత. ఎప్పటికి మరువలేనిది మరెప్పటికి తిరగరానిది. ఇక పరిశుద్ధ గ్రంథంలో చూస్తే దేవుని కోసం బ్రతికిన వారందరూ ఘనత పొందినవారిగానే కనబడతారు. వారి పేర్లు వాడకుండా మనం పరిశుద్ధ గ్రంథంను బోధించలేమని మనకు తెలుసు. పిల్లలను దేవునిలో పెంచితే దేవునిలోనూ, లోకంలోనూ ఘనులుగా పెరుగుతారు. దేవుని కోసం బ్రతికిన వారికి ఆయన ఇచ్చిన ఘనతను మరెవ్వరూ ఇవ్వలేరు. ఎవరూ దానిని అధిగమించలేరు. ఎందుకంటే ఆయన ఇచ్చే మహిమ ఘనతలు వేరెవ్వరూ ఇవ్వలేరన్నది ఇప్పటికే మీరు చదివిన దానిని బట్టి గ్రహించి ఉంటారని నా నమ్మిక. పిల్లలను పెంచే విషయంలో యధార్థత ఉండాలి. ఏదో ఆశించి పెంచితే కడకు అది నాశనానికే దారి తీస్తుంది గాని దేవుని చెంతకు కాదు. తల్లిదండ్రులు 'లోకంలో' పెరిగితే కూమారులు కూడా 'లోకంలోనే' పెరుగుతారన్నది పరిశుద్ధ గ్రంథం చెప్పిన మాట.

తండ్రియేమి చేయుట చూచునో కుమారుడు అదే చేయునన్నది పరిశుద్ధగ్రంథ వాక్యం.

పిల్లలు దేవునిలో పెరగాలంటే తల్లిదండ్రుల్లో ముందుగా 'దేవుని ప్రేమ' 'వాక్యం' ఉండాలి.. నిండాలి. వారలా ఉంటే వారి పిల్లలను కూడా దేవునిలో పెంచగలరు. అలా పెంచినప్పుడే దేవుడు ఎవరి కుటుంబానికైనా ఘనత మహిమలను కలుగజేస్తారు. ఆలోచించండి! ఆచరించండి!! అట్టివారే దేవుని ఘనత మహిమ ప్రభావములు యుగయుగములు ఉండునుగాక!! అన్న పరిశుద్ధ గ్రంథం వాక్యాన్ని పలుకుట సమంజసం. ఏమంటారు?

క్రైస్తవనాడు డిటిపి, పేజ్‌మేకింగ్ & డిజైనింగ్ : జె.సి. డిజైన్స్ , మెదక్ & విశాఖ. ఫోన్ : 9866113513

**ఎందుకు?! :** 'క్రైస్తవనాడు'లో హైందవ పండితులు, ఇతరులు, సినిమావాళ్లుచెప్పేవి మరియు రాజకీయాలను గురించి ప్రచురించుటెందుకన్నది 'మనలో' అనేకుల సందేహం! హోలీ బైబిలు దేవుని గ్రంథమంటూ బోధిస్తూ ఇతరులను, సినిమావాళ్లను చులకనజేసి మాట్లాడే ప్రబుద్ధులెందరో 'మనలో' ఉన్నారు. క్రైస్తవేతరుల మాటలు, చేతలే అంతలా ఆలోచింపజేస్తుంటే.. జీవంగల దేవుని మాటలు మరెంతలా ఆలోచింపజేయాలి! 'మనలో' ఎందరి మాటలు, చేతలు లోకాన్ని ఆలోచింపజేసి ప్రభావితం చేయగలుగుతున్నాయోనన్నది తెలిపేందుకే 'క్రైస్తవనాడు'లో అవి ప్రచురిస్తున్నాం. ఇక రాజకీయాలను గురించి... ఆ యా కాలాల్లో జరిగిన సమకాలీన రాజకీయాలు. సంగతులను అనేకం హోలీ బైబిల్లో దేవుడు వ్రాయించారు. 'నర'లోక సంగతులనే అవగాహన చేసుకోలేనివారు 'పర'లోక సంగతులను ఎలా గ్రహించగలరు? అందుకే 'నర'లోక రాజకీయ సంగతులు 'క్రైస్తవనాడు'లో చోటుచేసుకుంటున్నాయి. తొలి నుంచీ 'క్రైస్తవనాడు'ది అదే ఒరవడి. అందుకు హోలీ బైబిలే మాకు మాదిరి. అందుకే 'క్రైస్తవనాడు'కు అంత ఘనత! అందుకు 'దేవునికి స్తోత్రము'.

**ANDHRA PRADESH :** CHRISTAVANAADU,
13 - 237. Ambedkar Nagar, Old Police Station Center,
Nr. TIC Point, Arilova, Visakhapatnam - 530 040.
Andhra Pradesh State, INDIA.
Call : 9346960601, 9866113513

**TELANGANA :** CHRISTAVANAADU
C/o A.Prem Kumar, 1-5-89/6,
CSI Mission Compound,
Sadasivpet, Medak Dist - 502 291
Telangana State, INDIA. Call : 9346960601

మర్మమేంటో తెలుసుకోవాలనుందా? అయితే ఇది చదవండి !

# యేసుక్రీస్తు సిలువ సందేశం

**మ**నము యేసు, సిలువ సందేశం యొక్క ప్రాముఖ్యత గుర్తిం చడం చాలా అవసరం. ఈ సందేశాన్ని క్రైస్తవ సంఘంలో విశ్వాసు లుగా పిలువ బడిన వారిలో అనేకమంది పలుమార్లు వింటూ....న్నారు, ధ్యానిస్తున్నారు. అయినప్పటికీ క్రీస్తు మరణ పున:రుత్థానముల యొక్క ఐక్యతను అనుభవించలేని స్థితిలో ఉన్నారు. సిలువపై క్రీస్తు పలికిన మాటలు అనేకమంది వింటూ ఉంటారు. మరి కొందరు వాటిని పలుకుతూ ఉంటారు. కాని, వారి వ్యక్తిగత జీవితాలలో వాటిని అన్వయించుకోని స్థితిలో ఉన్నారు. రోమీయులకు వ్రాసిన పత్రిక 6వ అధ్యాయములో క్రీస్తు మరణ పున:రుత్థానములోని విశ్వాసి యొక్క ఐక్యతను గూర్చిన అద్భుతమైన సూత్రంను పౌలు ప్రత్యక్షపరుస్తున్నాడు. కాని, 7వ అధ్యాయములో పౌలు **'అయ్యో నేనెంత దౌర్భాగ్యుడను, ఇట్టి మరణమునకులోనగు శరీరము నుండి నన్నెవడు విడిపించును?'** అని మొరపెడుతన్నాడు. ఇది పౌలు యొక్క ఆర్తనాదం. ఎందుకంటే క్రీస్తు మరణ పున:రుత్థానముల యొక్క ఐక్యతను పౌలు ఇంకా అప్పటికి అనుభవించలేదు (రోమా 7:24). గనుక మనము రోమా 6వ అధ్యాయం చదివినప్పుడు మనము నాలుగు ప్రాముఖ్యమైన మాటలు కనుగొనగలము



బిషప్.ఎం.ఎ.పాల్

### ఎరుగుట (తెలుసుకొనుట)

'ఎరుగుట' అనగా సన్నిహిత బాంధవ్యం. **'క్రీస్తుయేసులోకి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోకి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?'** (రోమా 6:3)లోని ప్రశ్న ఒక వ్యక్తి వెయ్యిసార్లు చదివినా, ధ్యానించినా దాని యొక్క అనుభవంలోనికి రాని యెడల నిష్ప్రయోజనము. క్రీస్తు మరణ పున:రుత్థానములోని విశ్వాసి యొక్క ఐక్యతను గూర్చి వినినా, చదివినా, ధ్యానించినా ఆ సత్యవాక్కును అనుభవించలేడు. ఈ మాటను గూర్చి మరింతగ రోమా 4,5,6 అధ్యాయములలో చూడగలము.

### ఎంచుకొనుట

**'అటువలె మీరును పాపము విషయమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసునందు సజీవులగాను మిమ్మును మీరే ఎంచుకొనుడి'** (రోమా 6:11) అనే సత్యవాక్కును వ్యక్తిగత జీవితంలో అనుభవించుట చాలా ప్రాముఖ్యం. 'ఎంచుకొనుట' అనేది మనం అనుదిన జీవితములో చదువుట, ధ్యానించుట కాకుండా అనుభవం అయ్యుండాలి.

### అప్పగించుకొనుట

**'మీ అవయవములను దుర్నీతి సాధనములుగా పాపమునకు అప్పగింపకుడి, అయితే మృతులలోనుండి సజీవులమనుకొని, మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి, మీ అవయవములను నీతి సాధనములుగా దేవునికి అప్పగించుడి'** (రోమా 6:13). ఒకవేళ మన అవయ వములను దుర్నీ తికి సాధనములుగా అప్పగిం చుకొనిన యెడల అది నిత్య మరణానికి దారి తీస్తుంది. గనుక మన యొక్క అవయవములను నీతికి సాధనములుగా దేవునికి అప్పగించుకొనిన యెడల అది నిత్యజీవానికి దారి తీస్తుంది.

### విధేయులగుట

**'లోబడుటకు దేనికి మిమ్మును మీరు దాసులుగా అప్పగించుకొందురో, అది చావు నిమిత్తముగా పాపమునకే గాని, నీతి నిమిత్తముగా విధేయతకే గాని దేనికి మీరు లోబడుదురో దానికే దాసులగుదురని మీరెరుగరా?'** (రోమా 6:16). సాధారణముగా విధేయత ఆశీర్వాదానికి కారణమవుతుంది. మొదటి ఆదాము యొక్క అవిధేయత కారణంగా పాపము సమస్త మానవాళిని ఏలుతూ వస్తుంది. ఆనాటి నుండి కూడా పాపస్వభావం మానవాళిపై అజమాయిషీ చెలాయిస్తుంది. దేవుని ఆత్మద్వారా మొదటి ఆదాము జీవించు ప్రాణియైయున్నాడు. కానీ కడపటి ఆదాము దేవుని ఆత్మ అనుసంధానం ద్వారా జీవింపచేయు ఆత్మయైయున్నాడు. ఆ కడపటి ఆదామే క్రీస్తు (అభిషిక్తుడు). ఈయన యొక్క విధేయత ద్వారా నిత్యజీవము లభించింది.

రోమా 7వ అధ్యాయము, మరికొన్ని లోతైన సత్యాలను బయలుపరుస్తుంది. పాపము యొక్క బలం, దాని ప్రభావము మానవ జాతిని ఎంతగా వినాశనము చేయగలదో తెలియజేస్తుంది. ధర్మశాస్త్రము మానవుని యొక్క అంతరంగములో దాగియున్న పాపాన్ని బట్టబయలు చేస్తుంది. గనుక మానవునికి, ధర్మశాస్త్రానికి ఉండే బాంధవ్యాన్ని మరణము వేరు చేస్తుంది. మరణించినవాడు పాపవిముక్తుడు. అటువలెనే పాపము విషయములో మరణించి పున:రుత్థానడైన క్రీస్తుతో ఐక్యమవుట ద్వారా నిత్యజీవానికి వారసుడయ్యాడు. ధర్మశాస్త్రోపదేశకుడైన పౌలు, ధర్మశాస్త్రము విషయములో అనింద్యుడుగా జీవించినప్పటికీ, తన యొక్క దౌర్భాల్యము, దౌర్భాగ్యతనురోమా 7:24 తెలుపుతుంది. మరియొక విధముగా ధర్మశాస్త్రము తన జీవితాన్ని ప్రప్రథమముగా ఏలుచున్న అనుభవం కలిగి, యేసు యొక్క మరణము ద్వారా తాను ధర్మశాస్త్రమునుండి విడుదల పొందాడు. ఒక విధముగా ధర్మశాస్త్రము తనకి మొదటి భర్తగా తన జీవితాన్ని ఏలునప్పటికీ, యేసు యొక్క జనన, మరణ, పున:రుత్థానము ద్వారా ధర్మశాస్త్రమునుండి విడుదల పొందాడు. మొదటి భర్త మరణము తరువాత క్రీస్తులో తన యొక్క ఐక్యతతో తన రెండవ భర్త యొక్క ఏలుబడికి తనను తాను అప్పగించుకొన్నాడు. అందు మూలముగా రోమా 8వ అధ్యాయమలో ఒక విజయవంతమైన సందేశాన్ని అనుభవపూర్వకంగా వ్యక్తపరుస్తున్నాడు. **'క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు'. 'కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను, ఇదిగో సమస్తమును కొత్తవాయెను'** (2 కొరింధీ 5:17) క్రీస్తుయేసునందు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమము పాపమరణముల నుండి ఏలాగు విడిపించగలదో అనేది ఒక అనుభవసాక్ష్యమై యుండాలి. గనుక శుభ శుక్రవారము మరియు క్రీస్తు పున:రుత్థాన దినమును మనము పైన విశదపరచిన సత్యములను గ్రహించకుండా ఎంతకాలము మనము ఆచరించినా నిష్ప్రయోజనము. క్రీస్తు మరణము మరియు క్రీస్తు పున:రుత్థానములే పౌలు యొక్క అంతిమ విజయ సందేశం.

# ప్రకటన గ్రంథము 1



**'ప్రకటన గ్రంథం' పై వివరణలు ఇప్పటివరకు మీరు రకరకాలుగా వినుంటారు! అందుకు సంబంధించి ఓ వివరణ సీనియర్ పాస్టర్ ఎ.యం.అబ్రహాంగారి కలం నుంచి 'క్రైస్తవనాడు'కు ప్రత్యేకం!**

**తె**లంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లాలో నివాసముంటున్న **పాస్టర్ ఎ.యం.అబ్రహాము** గారు ఏడు పదుల వయసులోనూ నిత్యం పరిశుద్ధగ్రంథాన్ని ధ్యానిస్తూ.. రచనలు చేస్తూనే ఉంటారు. సత్యాన్ని ఉన్నదున్నట్లు సమాజానికి అందించాలన్న ఆశయాన్ని పుష్కలంగా కలిగిన సీనియర్ పాస్టర్ రెవ.అబ్రహాము గారు అనుట అతిశయోక్తికాదు. వీరెంతో అనుభవజ్ఞులు.. నిగర్వి. అది వారింటికి వెళ్లేవాళ్లకి స్పష్టంగా కనబడుతుంది. వారి ఇతర రచనలు కూడా దీని తరువాత పాఠకులు చదువగలరు – **ఎడిటర్.**

## ప్రకటన గ్రంథము - తొలి పలుకులు

**యేసుక్రీస్తు యొక్క శిష్యుడైన యోహాను ప్రకటన గ్రంథమును రచించాడు. గ్రంథకర్త గురించి దిగువ వ్రాయబడినది గమనించగలరు.**

1. యోహాను సువార్తలో ఇతడు "యేసు ప్రేమించిన శిష్యుడు" అని పిలువబడుచున్నాడు (యోహాను 13:23, 19:26, 20:2, 21:7, 21:20).
2. ఇతని తండ్రి పేరు జెబదయి (మార్కు 3:17) తల్లి పేరు సలోమే (మత్తయి 27:56, మార్కు 15:40).
3. యేసు సిలువ వేయబడినపుడు తన 12 మంది శిష్యులలో కేవలము యోహాను సిలువ యొద్ద ఉండుట గమనార్హము (యోహాను 19:26–27).

యోహాను సువార్త మరియు తన పేరట వ్రాయబడిన మూడు పత్రికలకు కూడ ఇతడే గ్రంథకర్త. ఇతడు సుమారు 100 సంవత్సరములు బ్రతికి సహజమైన మరణము పొందినాడు. ఇతడు పత్మాసు ద్వీపములో దాదాపు క్రీ.శ. 96లో పరవాసిగా ఉంటున్నాడు (ప్రకటన 1:9).

అట్టి సమయములో దేవుడు అతని కాలము మొదలుకొని నిత్యత్వము వరకు అనగా క్రొత్త ఆకాశము, క్రొత్త భూమి సృష్టింపబడు వరకు జరుగు సంఘటనలు క్రమముగా ఏమేమి సంభవించనైయున్నవో వాటిని దేవుడు తన ద్వారా వ్రాయించాడు.

1:19 లో చెప్పబడినట్లు తాను చూచిన యేసుక్రీస్తు దర్శనము మొదటి అధ్యా యములో వ్రాసాడు.

1:19 లో చెప్పబడినట్లు ఉన్నవాటిని గురించి అనగా ఆసియాలో ఉన్న 7 సంఘములకు చెందిన 7 సందేశములు నేడు ఉన్న అన్ని సంఘములకు చెందినది. అనగా సంఘము పరమునకు ఎత్తబడు వరకు ఈ సందేశములు అన్ని సంఘములకు చెందినది.

ఆ తరువాత 1:19లో చెప్పబడినట్లు "వీటి వెంట కలుగబోవు వాటిని" అనగా సంఘ ఆరోహణము తరువాత ఏమేమి సంభవించునో వాటిని 4:1 నుండి 22:5 వరకు వ్రాసాడు. అనగా సంఘము పరలోకమునకు ఆరోహణమైన తరువాత పరలోకములో ఏమేమి సంభవించునో 4, 5 అధ్యాయములలో వ్రాసాడు.

7 ముద్రలు విప్పబడుట మరియు మధ్యంతరముగా చెప్పబడిన మాటలు 6:1 నుండి 8:1 వరకు వ్రాయబడింది. ఆ తరువాత 7 బూరలు ఊదుట మరియు మధ్యంతరముగా చెప్పబడిన మాటలు 8:2 నుండి 13:18 వరకు వ్రాయబడింది. ఆ తరువాత 7 ఉగ్రత పాత్రలు కుమ్మరించబడుట మరియు మధ్యంతరముగా చెప్పబడిన మాటలు 14:1 నుండి 19:21 వరకు వ్రాయబడినవి. ఆ తరువాత 1000 సంవత్సరముల పరిపాలన గురించి 20వ అధ్యాయములో వ్రాయబడింది తరువాత క్రొత్త ఆకాశము, క్రొత్త భూమి 21:1 నుండి 22:5 వరకు, ఆ తరువాత ముగింపు సంఘటనలు 21:6–21 వచనములలో చదువగలము.

### అధ్యాయము - 1

యేసుక్రీస్తు యోహానుతో నీవు చూచిన వాటిని (భూతకాలము) గూర్చి వ్రాయుమన్నాడు (ప్రక 1:9). అందుకే ప్రకటన 1 అధ్యాయములో తాను చూచిన యేసుక్రీస్తు దర్శనము వ్రాసాడు.

యేసుక్రీస్తు యోహానుతో ఉన్నవాటిని గూర్చి అనగా 7 సంఘములను గూర్చి వ్రాయమన్నాడు (ప్రక 1:19–20). కనుక వర్తమానకాలములో ఉన్న సంఘములకు అనగా మన అందరికి ఇందలి సందేశములు వర్తించును (ప్రక 2 మరియు 3 అధ్యాయములు). భవిష్యత్ కాలము ప్రకటన 4:1–2 లో "ఈ సంగతులు జరిగిన తరువాత" (భవిష్యత్ కాలము) అను మాటలు చదువుచున్నాము. అనగా సంఘము కాలము తరువాత "ఇక్కడికి ఎక్కిరమ్ము" సంఘము వినును. యోహానుతో పాటు మనము పరమునకు కొనిపోబడుదుము. కనుక ప్రకటన 4వ అధ్యాయము నుండి మిగతా అన్ని అధ్యాయములు భవిష్యత్ కాలమునకు చెందినవి.

1.ఈ గ్రంథమును దేవుడు యేసుక్రీస్తునకు కనపరచియున్నాడు. యేసుక్రీస్తు తన దూత ద్వార శిష్యుడైన యోహానునకు సూచించెను. (1:1). యోహాను ద్వారా దేవుడు తెలియచేయుచున్నాడు (1:11). 2. ఈ గ్రంథములో యోహాను కాలము నుండి నిత్యత్వము వరకు సంభవించనై యున్నవాటిని తన దాసులకు కనుపరచుటకు దేవుడు వ్రాయించెను (1:1) అనగా సంఘకాలములో జరిగేవి (1 నుండి 3 అధ్యాయములు) తరువాత పరలోకమందు సంభవించునని (4 నుండి 5 అధ్యాయములు) తరువాత వెయ్యి సంవత్సర కాలములో సంభవించునవి (20వ అధ్యాయము) తరువాత కొత్త అవకాశము మరియు భూమి గల నిత్యత్వము (21, 22 అధ్యాయములు)

(రెండవ భాగం తదుపరి 'క్రైస్తవనాడు'లో)

**రచయిత గురించి..!**

డా.నిరీక్షణ కె.కంచర్ల హైందవ కుటుంబములో జన్మించి, ప్రభు క్రీస్తు దర్శనభాగ్యమొంది గత 28 సంవత్సరాలుగా దేవుని సేవలో ఉన్నారు. సంఘ కాపరిగా, బైబిలు ఉపాధ్యాయులుగా, సువార్తికులుగా, గీత రచయిత మరియు పద్యగాయకునిగా దేవుని సేవలందిస్తూ, టి.వి., రేడియో మరియు రచనల ద్వారా దైవసేవలందిస్తున్నారు.

స్వదేశంలోనూ, విదేశాలలో దేశీయ విద్యతోబాటు పలు వేదాంత విద్యలను అభ్యసించి ప్రజా చైతన్య సేవలో కొనసాగుతున్నారు. బైబిలు ఉపాధ్యాయులుగా గత 28 సంవత్సరాలలో వేలమంది యువతీ యువకులకు తర్ఫీదు చేసారు. వారిలో అనేకులు సంఘ నిర్మాతలుగా, సువార్తికులుగా, ఉపదేశకులుగా దేశ విదేశాలలో సేవలందిస్తున్నారు.

వీరికి తబిత గుళ్ళపల్లి గారితో వివాహమై రూత్ హర్షిత మరియు గీత్ హర్మిత కుమార్తెలతో కుటుంబమును, సేవను కొనసాగిస్తున్నారు. వీరి సతీమణి తబిత మరనాత చిల్డ్రన్ హోమ్ డైరెక్టరుగా సేవలందిస్తు సంఘ సేవలలో సహకరిస్తున్నారు.

## ఆధ్యాత్మిక విజ్ఞాన ధారావాహిక - 1

# అభ్యర్థన - ఆచరణ - ఆశీర్వాదము

### ఆయన మీతో చెప్పునది చేయుడి



**Dr. Nireekshana K. Kancharla**
MA., MBA., M.A., M.Div., M.Th., D.Min., (Ph.D. In Phil. AU. AP)
Director : **Maranatha Theological Seminary**
Hyderabad

కొన్ని గూఢమైన విషయాలను మీకు జ్ఞాపకం చేసి, మనలో నివురుగప్పి, నిస్తేజంగా ఉన్న విశ్వాస దీపాంకురాలను ప్రజ్వలింపజేయాలనే ప్రగాఢవాంఛతో ఈ ఆధ్యాత్మిక విజ్ఞాన ధారావాహికను ప్రారంభిస్తున్నాము. ఇది పాఠకోత్తములందరికీ ఆచంచల విశ్వాసాన్ని, ఆత్మ వికాసాన్ని కలిగించి, ఆధ్యాత్మిక సమతుల్యాన్ని, భక్తిని, ఆలోచనను అంకురింపజేయగలదని ఆశిస్తున్నాము. పెద్దలైనవారు, స్వానుభవంతో చెప్పిన మాటలు వినటం వలన, వారి రచనలు చదవటం వలన విశ్వాసం కలుగుతుందని మనకు తెలుసు! ముందు వినాలి, చదివి గ్రహించాలి, ఆపైన ఆత్మపరిశీలన చేసుకోవాలి. మనలో ఉన్న లోటుపాట్లను వినయంతో సరిదిద్దుకొని విశ్వవిజేతయైన క్రీస్తునాధుని సుబోధలను విశ్వవ్యాప్తం చెయ్యాలి. సున్నితంగా ఆధ్యాత్మిక విషయాలను విశ్లేషించే ఈ వ్యాసమాలికను ఆద్యంతం భక్తిశ్రద్ధలతో చదివి, నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకొని, ప్రభుని బోధలలోని సత్యాన్ని గ్రహింపగలరు.

మనలో కొందరు ప్రభువు చేసిన ప్రబోధాలను ఆచరించటం మానివేసి, అహోరాత్రాలు ప్రార్థించినా ఆయన మా మనవులు వినటం లేదు.., మా ప్రార్థనలకు ప్రతిఫలం దయచేయటం లేదు..., అయినా మేము అత్యంత ఓర్పుతో, సహనంతో, పట్టుదలతో ప్రార్థిస్తున్నామని, తమ ఓపికను నివేదిస్తూ, క్రీస్తు ప్రభువును ప్రార్థనలకు త్వరితగతినిమీయనివానిగా, కన్నీరు మున్నీరుగా విలపించి, విజ్ఞాపనలు చేసినా వినిపించుకోని ఇలవేలుపుగా, తమకు తెలియకుండానే చిత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది చాలా సున్నితంగా సహృదయులందరు గమనింపవలసిన అతి ముఖ్యవిషయం. నిజానికి ప్రార్థనలు చేయటం ఎంత ప్రాముఖ్యమో ప్రభువు చెప్పినట్లు చేయటం కూడా అంతే ప్రాముఖ్యమైనది. మనం ప్రార్థన చేయటానికిచ్చినంత ప్రాధాన్యమును, ఆయన చెప్పిన కార్యాలను చేయటానికీయటం లేదు. ఇది మనకు తెలియకుండానే మనలో జరుగుతున్న అసంకల్పిత చర్య! ప్రభుని వాక్యవిశ్లేషణలో స్థానాస్థానాలను, సమయాసమయాలను, అసందర్భాలను గమనింపవలసిన అవసరము ఎంతైనా ఉంది!

ద్వితీయోపదేశకాండములో, అంటే దేవుడు రెండవసారి ఉపదేశమిచ్చిన పుస్తకంలో “నీవు నీ దేవుడైన యెహోవా మాట శ్రద్ధగా విని, నేడు, నేను నీకు ఆజ్ఞాపించుచున్న ఆయన ఆజ్ఞలన్నిటిని అనుసరించి నడుచుకొనిన యెడల, నీ దేవుడైన యెహోవా మాట వినినయెడల, ఈ దీవెనలన్నియు నీ మీదికి వచ్చి, నీకు ప్రాప్తించును. నీవు పట్టణములో దీవింపబడుదువు. పొలములో దీవింపబడుదువు. నీ గర్భఫలము, నీ భూఫలము, నీ పశువుల మందలు, నీ దుక్కిటెద్దులు, నీ గొఱ్ఱెమేకల మందలు దీవింపబడును. నీ గంపయు, పిండిపిసుకు నీ తొట్టియు దీవింపబడును. నీవు లోపలికి వచ్చునప్పుడు దీవింపబడుదువు. వెలుపలికి వెళ్ళునప్పుడు దీవింపబడుదువు'! (ద్వితి. 28:1-6). దేవుని మాట వినాలి. ఆయన చెప్పినది తు॥చ॥ తప్పకుండ చేయాలి. అప్పుడు దేవుడు మనలను అందరికంటే ఎక్కువగా ఆశీర్వదిస్తాడు. మన పట్టణము, సంతానము, పశువులు, సంసారము దీవింపబడుటే కాక, మనం ఎటు వెళ్ళినా దీవెనలే సంప్రాప్తిస్తాయి. ఆయన అజ్ఞానువర్తులమై జీవించటం, అత్యంత దీవెనకరం! ఆయన మాటకు, ఆజ్ఞకు మనం సమ్మతించి, నామాట వినినయెడల మీరు భూమి యొక్క మంచి పదార్థములను అనుభవింతురు' (యెషయా 1:19). విశ్వాసవీరుడైన యోబు తన స్వానుభవాన్ని వివరిస్తూ - 'ఆయన పెదవుల ఆజ్ఞను నేను విడిచి తిరుగలేదు. ఆయన నోటి మాటలను, నా స్వాభిప్రాయము కంటే ఎక్కువగా ఎంచితిని' అంటున్నాడు! (యోబు 23:12).

పైనున్న లేఖనాలను పరిశీలిస్తే, వీటిలో ప్రభుని మాట వినటం వలన సంక్రమించే దీవెనలు ప్రస్తావించబడ్డాయి. క్రీస్తు ప్రభువు కూడ తన బోధనలలో 'మీరు శోధనలో ప్రవేశింపకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థనచేయుడి' (మత్తయి 26:41) అని చెప్పిన ప్రభువే 'నేను చెప్పిన మాటల ప్రకారము మీరు చేయక, ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు? అని ప్రశ్నిస్తున్నాడు (లూకా 6:46). అంటే, ప్రభుని ప్రార్థించటం ఎంత ముఖ్యమో, ఆయన చెప్పింది చేయటం కూడ తత్సమానమైనదేనని మనం భావించి తీరాలి. ప్రభువు ఇంకా విపులంగా 'ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచువాడును పరలోకరాజ్యములో ప్రవేశింపడు గాని, పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును! అన్నారు (మత్తయి 7:21). ఒకసారి ప్రభువు బోధిస్తూ ఉన్నప్పుడు జనులు గుంపులు గుంపులుగా కూడి ఆసక్తితో వింటున్నారు. ఆ సమయంలో ప్రభుని తల్లి, సహోదరులు వెలుపల ఉండి, ప్రభువును పిలువనంపారు. అప్పుడు ప్రభువు తన చుట్టూ ఉన్నవారిని చూచి - 'దేవుని చిత్తము చొప్పున జరిగించువాడే నా సహోదరుడు, నా సహోదరియు, నా తల్లియునని చెప్పెను' (మార్కు 3:35). అంతేకాకుండ క్రీస్తుస్వామి తన మాటలను నెరవేరిస్తే, మనం అడిగిన సమస్తం అనుగ్రహిస్తానని తెలియజేశారు. 'నాయందు మీరును, మీయందు నా మాటలును, నిలిచియుండిన యెడల, మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును' అన్నారు (యోహాను 15:7). దీనిని బట్టి ప్రభువును ప్రార్థించటం, ఆయన చెప్పినట్లు చేయటం ఈ రెండు కార్యాలు క్రైస్తవ జీవితాలు ఫలప్రదం కావటానికి ముఖ్యాంశాలని పాఠకోత్తములు గ్రహింతురు గాక! మన సంఘాలలో సంపూర్ణరాత్రి ప్రార్థనలు, దీర్ఘకాల ప్రార్థనలు వివిధ సమయాలలో ఉపవాస దీక్షలు, ఇత్యాది కార్యక్రమాలపై ఉన్న భక్తిశ్రద్ధలు, ప్రభువు చెప్పినట్లు చేయడంలో చూపడంలేదు. ఒకవ్యక్తి ఆధ్యాత్మికతను కేవలం పై విధానాలను బట్టి మాత్రమే గాక, ప్రభువు మాటకు నిస్వార్థంగా, నిజాయితీగా స్పందించి, కపటములేని భక్తితో జరిగించే వివిధ సంగతులను పరిగణలోనికి తీసుకోవటం కూడ నిజమైన అవగాహనతో కూడిన అంచనా అవుతుంది కాదా! సత్య పరిశీలకులు ఆలోచింపవలసినదిగా మనవి! పైన చెప్పబడిన ప్రార్థనా విధానాలను ఎంతో శ్రద్ధగా జరిగిస్తున్నామో, అంతే శ్రద్ధతో సంఘములలోను, సభలలోను చేసే దిద్దుబాటు, ఉపన్యాస ధోరణులు ఎక్కువ సత్ఫలితాలను ఇవ్వగలవని భావింపబడుతుంది.

దినదినమూ, దివారాత్రులూ, కన్నీటితో ప్రార్థిస్తున్నా, ప్రభువు మా ప్రార్థనలను ఆలకించటం లేదని, కొంతమంది విశ్వాసులు వాపోవుట కద్దు. కొన్ని కొన్ని సమయాలలో, కొందరిపట్ల ఒక ప్రత్యేక ప్రణాళికను కలిగి ఉండటం వల్ల, ప్రభువు వారి ప్రార్థనలకు త్వరితగతిని ప్రతిఫలమీయకపోవచ్చు. అటువంటి ప్రత్యేక వ్యక్తులను, సమయాలను మినహాయిస్తే, ప్రభువు తన భక్తుల ప్రార్థనలకు ప్రతిఫలం, సమాధానం ఇవ్వటంలో యెన్నడూ ఆలస్యం చేయడు. 'మీరడిగినను, మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై, దురుద్దేశముతో అడుగుదురు గనుక, మీకేమియు దొరుకుటలేదు' (యాకోబు4:3). మన ఉద్దేశాలు మంచివై అడిగినప్పుడు మనకు సమాధానం లభిస్తుంది. ఇది విశ్వాసులందరికీ అనుభవైకవేద్యమే! ఉదాహరణకు : ప్రభువు సిలువలో మహావేదన పడుతున్న సమయంలో కూడ, కుడివైపున గల దొంగ ఆయనను చూచి - యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకం చేసుకోమని విన్నవించగా, ప్రభువు అతని విజ్ఞాపనను విని, 'వానితో - నేడు నీవు నాతోకూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను' (లూకా 23:24). కనుక వినయంతో విజ్ఞాపన చేసేవారి ప్రార్థనలకు ప్రభువు తప్పకుండ, ప్రతిఫలం దయచేయగల దక్షుడు, దయా సముద్రుడు! మరి మనలో కొందరి ప్రార్థనలకు ప్రతిఫలమెందుకు రావటం లేదని ప్రశ్నించుకుంటే,.... మనం, దేవుని సంగతులను గ్రహించటంలో తడబడుతున్నప్పుడు, మన విశ్వాసంలో స్థిరత్వం వచ్చేవరకు దేవుడు వేచియుండి, తగిన సమయంలో మనకు సహాయం చేస్తున్నాడు. అంటే.., అది మన నిర్లక్ష్యమేగాని, దేవుని జాప్యం కానేకాదు! ఆయన నిరంతరం మన మొరలాలకించి, ప్రతిఫలం దయచేయటానికి సంసిద్ధంగా ఉంటాడు!

ఇక్కడ మనం కొన్ని ఉదాహరణలను గమనిస్తే, మన లోపాలు, క్రీస్తుస్వామి యొక్క దయాదాక్షిణ్యాలు స్పష్టంగా అర్థమవుతాయి. మనం భోజనపదార్థాలను తగిన విధంగా తయారు చేస్తేనే భుజించటానికి యోగ్యంగా ఉంటాయిగాని, పద్ధతి లేకుండా, అశ్రద్ధగా వండితే తినలేము కదా! అలాగే ఒక వాహనాన్ని కొని, మన ఇష్టానుసారం, రహదారులపై పరుగులెత్తిస్తే కొంతకాలం సాగవచ్చునేమోగాని, అది ప్రమాదభరితమైన ప్రయాణమని మనం గ్రహించటానికి యెంతో కాలం పట్టదు గదా! మన పిల్లవానిని ఉన్నతాశయాలు, ఉత్తమ విద్య నేర్పే పాఠశాలలో, అనుభవజ్ఞులైన, అధ్యాపకుల దగ్గర చేర్పించినా, ప్రతిరోజూ మనం గమనిస్తూ, అతడు శ్రద్ధగా చదువుతూ ఉంటేనే తప్ప, అతడు విద్యాధికుడు కాలేడు గదా! మంచి వైద్యునియొద్ద మనం విలువైన వైద్యం చేయించుకుంటూ, క్రమపద్ధతిలో పత్యముండకపోతే, జబ్బు నయంకాదు గదా! క్షేమ సమాచారాలతో ఆప్యాయంగా లేఖవ్రాసి, చిరునామా తప్పుగా వ్రాస్తే ఆ ఉత్తరం గమ్యాన్ని చేరదు గదా! అలాగే ప్రభువు చెప్పిన వాటిని చేయకుండా, నిరంతరం ప్రార్థించినా, సత్ఫలితాలు రావని భావించవచ్చు!

రెండువేల సంవత్సరాలకు పూర్వం, యేసుప్రభుని శిష్యుడైన తోమా ద్వారా భారతదేశానికి సువార్త వచ్చింది. ప్రస్తుత సంఘ పరిస్థితిని గమనిస్తే, మన విస్తరణ పరిమితంగానే ఉన్నదనటంలో సందేహం లేదు! అసలు యేసుప్రభువు పునరుత్థానుడై, స్వర్గానికి ఆరోహణమయ్యే ముందు శిష్యాళికి ఏమి చెప్పారు? - 'అయితే - యేసు వారియొద్దకు వచ్చి, పరలోకమందును, భూమి మీదను నాకు సర్వాధికారమియబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో, వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు, సదాకాలము మీతోకూడ ఉన్నానని చెప్పెను' (మత్తయి 28:18-20). క్రైస్తవ సంఘం ఈ ఆజ్ఞను అర్థం చేసుకొని, పురోగమిస్తున్నదని మనం చెప్పగలమా? చెప్పలేము! కొద్దిమందినిమాత్రమే విశ్వాసులుగా సిద్ధంచేసి, ప్రతి చిన్న విషయానికి, చిన్నచిన్న అనారోగ్యాలకు, చిరు సమస్యలకు సంఘునాయకత్వంపై ఆధారపడే పరిస్థితులు కల్పించబడుతున్నాయి. సంఘ నాయకత్వంపై ఆధారపడి, విశ్వాసులు జరిగింపవలసిన కొన్ని విషయాలు ఉన్నమాట వాస్తవమే! అయితే ప్రభువిచ్చిన ఆజ్ఞలను లోతుగా పరిశీలన చేస్తే, సమస్త జనులను శిష్యులనుగా చేయటమంటే, జీవితంలో ఎదురయ్యే ఎటువంటి పరిస్థితినైనా తట్టుకొని, ప్రభువువైపు చూస్తూ, విశ్వాస స్వయంపోషకులుగా ఉండి, ప్రజలను ప్రభువు వైపునకు నడిపించేవారుగా ఉండాలి. అట్టివారిని తయారు చేయటమే సంఘునాయకుల ప్రధాన బాధ్యత! అయితే ఈనాడు ఏమి జరుగుచున్నది? కేవలము భౌతిక అవసరాలను తీర్చుకోవటానికి మాత్రమే, ఎక్కువమంది సంఘాలకు వెళుతున్నారు కారణం...? వారు వినే బోధలే! ఇక్కడొక సంగతిని గమనించాలి. యేసయ్య మన అవసరాలను తప్పనిసరిగా తీర్చేవాడే! అదే సమయంలో మనము ఆయన ప్రతినిధులముగా ఉండి, మన జీవన విధానాల ద్వారా, ప్రభువును ప్రజలకు చూపించి, ఆయన సన్నిధికి వారిని నడిపించవలసిన బాధ్యత కూడ మనమీద ఉన్నదని మరచిపోకూడదు. అయితే, ఇది ఈనాడు జరుగుతున్నదా? జరుగవలసినంతగా జరుగుట లేదు కదా! ఆధ్యాత్మిక స్వార్థంతో ఎన్ని దీవెనలు క్రీస్తుస్వామి వలన పొందినా, ఇంకా మరికొన్ని దీవెనల కొరకు ప్రార్థనలు చేయించుకోవటం తప్ప,

6లో

# తిండిపోతుతనము



**డా.జాయ్ చెరియన్**
యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్
రాం నగర్, (హైద్రాబాద్)

ఏడు ప్రధానమైన పాపములలో 'తిండిపోతుతనము' కూడ ఒకటని అంటుంటారు. తినడము కూడా పాపమా? అని ఆశ్చర్యపోకండి. తినడము పాపము కాదు గాని మితిమీరి అతిగా తినడము పాపము. అతిగా తినేవారినే తిండిపోతులంటారు. అతిగా తినడము వలన శరీరము మీద నియంత్రణ కోల్పోయి కామ, క్రోధ, మద, మత్సరము, లోభములు నీలోకి ప్రవేశిస్తాయి. అతిగా తినడము వలన శరీరము వ్యాధిగ్రస్తమైపోతుంది. అనేకమైన దీర్ఘకాల వ్యాధులు వస్తాయి. డయాబెటిస్, హై బ్లడ్ ప్రెషర్, గుండెకు సంబంధించిన వ్యాధులు కలుగడానికి అవకాశమిస్తున్నావు. దేహము దేవుని పరిశుద్ధాత్మకు నిలయమైయుంది. అందుకే నీ దేహమును ఆరోగ్యముగా కాపాడుకోవాలి. నీ దేహమును పాడుచేసే 'తిండిపోతుతనము' నీలో నుండి తొలగించుకోవాలి.

**'మీ హృదయములు ఒకవేళ తిండివలనను మత్తువలనను ఐహిక విచారముల వలనను మందముగా ఉన్నందున ఆ దినము అకస్మాత్తుగా మీ మీదికి ఉరివచ్చినట్టు రాకుండ మీ విషయమై మీరు జాగ్రత్తగా ఉండుడి.'** – లూకా 21:34

తిండిపోతుతనము శరీరమును మందత్వములోకి నడిపిస్తుంది. కొందరు అతిగా తిని బరువు పెరుగుతారు. శరీరము చురుకుగా ఉండదు. అతి తిండి నిన్ను సోమరితనములోకి తీసుకువెళ్తుంది. పనిచేయడానికి ప్రార్థించడానికి ఇష్టముండదు. ఎప్పుడు నిద్రపోతుంటారు. నిద్ర దరిద్రమునకు కారణమవుతుంది. ఐహిక విచారములు నిన్ను చుట్టుకుంటాయి. నీవు డిప్రెషన్‌లోకి వెళ్లిపోతావు. కొందరు డిప్రెషన్‌లో అతిగా తింటారట. తిండుబోతుతనము నిన్ను సోమరిగా, మందస్తునిగా చేస్తుంది. నీవు దేవునికి దూరమై దేవుని ఆశీర్వాదములు కోల్పోతావు. అందుకే యేసు ప్రభువు – మీ హృదయములు తిండివలన, మత్తువలన, ఐహిక విచారముల వలనను మందముగా ఉండనీయకుడి; ఎప్పుడూ మెలకువ కలిగి ప్రార్థన చేయాలి; ఆ దినము అంటే ప్రభువు దినము దేవుని ఉగ్రత దినము, అకస్మాత్తుగా ఉరివచ్చినట్టు మీ మీదికి రాకుండ మీరు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నాడు. నీవు చేసే పాపములకు చేదుఫలము అనుభవించ కూడదంటే పశ్చాత్తాప హృదయముతో దేవుని వేడుకోవాలి. అప్పుడు కీడును కొట్టివేసి నీ కుటుంబమును కాపాడుతాడు. నీ కుటుంబ సభ్యుల్లో పాపములో జీవిస్తున్న వారి మీదకు దేవుని ఉగ్రత రాకుండ నిన్ను నీవు తగ్గించుకొని ఉపవాసముతో వారి రక్షణార్థము ప్రార్థించాలి. నిద్రను, సుఖమును త్యజించి మెలుకువ గలిగి ప్రార్థించినప్పుడు తప్పకుండ వారి పాపముల నుండి విడిపింపబడి వారు రక్షింపబడతారు. దేవుని కనికరము, కృప అట్టి కుటుంబముల మీద ఉంటుంది. మీరు అతిగా తిని మందకొడిగా ఉండి ప్రార్థించకుంటే దేవుని శిక్షకు పాత్రులవుతారు.

రుచిగా ఉందని అతిగా తినకండి. నాలుక శరీరములో చిన్న అవయవమైనా దానిని నియంత్రించుకోవాలి. అతిగా మాట్లాడినా, అతిగా తిన్నా కూడ సమస్యలే. ఇప్పుడు వైద్యులేమంటున్నారంటే శరీరము రోగములనుండి కాపాడు కోవాలంటే తక్కువగా తినమని సలహా ఇస్తున్నారు. షుగరు, హై బి.పి. వ్యాధిగ్రస్తులనయితే రెండు ఇడ్లీలు లేదా రెండు పుల్కాలు తినాలంటారు. ఆహారపు అలవాటల్లు మార్చుకొని నియంత్రణలో ఉంటేనే మీరు ఆరోగ్యముగా ఉంటారని హెచ్చరిస్తున్నారు. కొందరు తలిదండ్రులు పిల్లల మీద ప్రేమ ఎక్కువైపోయి వారికి అతిగా తినిపిస్తుంటారు. దాని వలన వారు చిన్నప్పటి నుండి అధిక బరువు సమస్యతో బాధపడతారు, వ్యాధిగ్రస్తులవుతారు. ఎంత తినిపించాలో అంతే తినిపించండి. అతిగా తింటే ప్రమాదకరము. నీ శరీరమునకు ఎంత అవసరమో అంత ఆహారమే తీసుకోవాలి. అప్పుడు మీరు ఆరోగ్యముగా, చురుకుగా ఉంటారు. (Not the quantity but the quality of the food is important)

నీ శరీరమును నియంత్రించుకొనే నిగ్రహశక్తి పొందాలి. ఆశానిగ్రహము ఆత్మ ఫలము. నీవు పరిశుద్ధాత్మతో నింపబడినప్పుడే నిగ్రహశక్తిని పొందుతావు. మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చే ప్రతి మాటవలన జీవిస్తాడు. నీవు గొంతు వరకు తిని ఆయాసపడే కంటే కొద్దిగా మితముగా భుజించాలి. సగటు కడుపుకే తినమని పెద్దలంటారు. ఒకపూట ఆహారము లేకుంటే సణగకుండా దేవుని వాక్యమును చదువు. నీ హృదయములో దేవుని వాక్యము నింపుకుంటే అది నీ సర్వశరీరమునకు ఆరోగ్యము కలుగజేస్తుంది. కూర రుచిగా లేదని, మాంసము వంటలేదని వస్తువులు విసిరికొట్టే వారుంటే ఈ రోజునుండి ఆ అలవాటు మానుకోండి. విశ్వాసులకు ఇది తగదు.

దేవుని సేవకులు, దేవుని వాక్యము బోధించేవారు కూడ ఆహారపు అలవాట్లు అదుపులో ఉంచుకోవాలి. శరీరమును నియంత్రించుకోకుంటే రోగగ్రస్తులైపోతారు. దేవుని సేవ కుంటుపడిపోతుంది. అందుకే పౌలు భక్తుడు – నేను ఇతరులకు బోధించిన తరువాత నేనే భ్రష్టుడనైపోతానేమో అని నా శరీరము నలుగగొట్టుకొని దానిని లోపరచుకుంటున్నానని అంటున్నాడు. దేవుని కార్యములు చేయాలంటే నీవు ఆరోగ్యముగా ఉండాలి. నీ అనారోగ్యము దేవుని సేవకు ఆటంకము కాకూడదు.

**'గాలిని కొట్టినట్టు నేను పోట్లాడుటలేదు గాని ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి, దానిని లోపరచుకొనుచున్నాను.'**

– 1 కొరింథీ. 9:27


నేను దేవుని పోలి నడుచుకుంటున్నాను, మీరు నన్నుపోలి నడుచుకొనుడని పౌలు చెపుతున్నాడు.

**'సహోదరులారా, మీరు నన్ను పోలి నడుచుకొనుడి; మేము మీకు మాదిరియైయున్న ప్రకారము నడుచుకొనువారిని గురిపెట్టి చూడుడి. అనేకులు క్రీస్తు సిలువకు శత్రువులుగా నడుచుకొనుచున్నారు; వీరినిగూర్చి మీతో అనేక పర్యాయములు చెప్పి ఇప్పుడును ఏడ్చుచు చెప్పుచున్నాను.** (7లో)

## 'క్రైస్తవనాడు' ఆర్టికల్స్‌పై బిషప్ కె.జాన్ దేవదాస్ స్పందన!



రెవ.డా.యేసుపాదం



బిషప్ కె.జాన్ దేవదాస్



పి.ఇమ్మానుయేల్

● మనుషులు జన్మతో పాపులన్న రెవ.డా.పి.యేసుపాదం(విశాఖపట్నం) బోధను గురించి 'క్రైస్తవనాడు' పేపర్లో ఇవ్వబడిన ముందస్తు ప్రకటనపైనే స్పందించి.. ఖండన తెలిపారు బిషప్ కె.జాన్‌దేవదాస్ (హైద్రాబాద్)

● 'క్రైస్తవనాడు'లో గత డిసెంబర్‌లో 'జ్ఞానుల చరిత్ర అని ప్రచురించబడిన దానిపై కూడా బిషప్ కె.జాన్ దేవదాస్ స్పందించారు. ఖండనతో కూడిన వారి స్పందనను రచయిత పి.ఇమ్మానుయేలు (విశాఖ) గారితోబాటు 'క్రైస్తవనాడు'కూ పంపారు.

**(ఆ యా వివరాలు.. తదుపరి 'క్రైస్తవనాడు'ల్లో ప్రచురించగలం – ఎడిటర్)**

**● యేసు అంటే ఖాళీ సిలువేనా? (అది చెక్కో లేక ఇనుపముక్కో స్తోమతుంటే వెండి బంగారాలో అవచ్చుగాక!) ● పరిశుద్ధాత్మ అంటే పావురం (పక్షి) అని చూపుతూ చెప్పే దౌర్భాగ్యపు బోధలు ఇంకెంతకాలం? బోధకులారా మీరు మారరా? విశ్వాసుల్ని మారనివ్వరా? - బ్రదర్ వైకెయార్, హోలీ బైబ్లిసిస్ట్.**
**యేసుక్రీస్తుని కలిగున్నవారిని ఎవరూ మోసగించలేరు! వారు ఎవర్నీ మోసం చేయరు!! ..అవునా? కాదా? ఆలోచించాలి!**

## రెవ.జాన్‌పాల్ కన్నుమూత

విశాఖపట్నంలో గతంలో 'వాస్తవ నివేదిక', ఆ తర్వాత 'తేజో దిక్సూచి' పేర్లతో పత్రికలను నడిపిన రెవ.జాన్‌పాల్ కన్ను మూసారు. కాపరిగానూ పనిచేసారని తెలిసింది. ప్రస్తుతం ఆయన ఫ్లెక్స్ ప్రింటింగ్ ద్వారా జీవనం చేస్తున్నారు.



### ఆధ్యాత్మిక విజ్ఞాన ధారావాహిక - 1

## అభ్యర్థన - ఆచరణ - ఆశీర్వాదము

ఆయన మీతో చెప్పునది చేయుడి

**(5వ, పేజీ తరువాయి)** ఆయన దగ్గరకు ప్రజలను నడిపించటానికి కృషిసల్పేవారు తక్కువగా ఉన్నారు.

ఈ విషయమును అందరూ విశాల దృక్పథాలతో ఆలోచించి, దైవాత్మకు అనుకూలంగా స్పందించటం సముచితం! కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి అన్న ప్రభువు మనకు అప్పగించిన బాధ్యతను, ప్రార్థన పేరుతో, తెలిసీ తెలియక తిరిగి ఆయనకే అప్పగించే విధానాలను విడనాడాలి. ఉదాహరణకు : ప్రపంచాన్ని రక్షించుటకు ప్రభువా, సంఘాన్ని అభివృద్ధి చేయి ప్రభువా, ప్రజలకు మారుమనను దయచేయి ప్రభువా అని ప్రార్థించటం చాలా తేలిక! అయితే ఇక్కడొక సంగతిని పరిశీలించాలి. మనలో కొంతమంది భక్తిని, భక్తిసూత్రాలతో జరిగించకపోయినా, కరుణాపూరితుడైన దేవుడు వారికి సహాయం చేస్తూనేఉన్నాడు. అంటే అలాంటివారి భక్తి సరియైనదని కాదు, ఇక్కడ దేవుని ఔన్నత్యమే ప్రధానము! సువార్త సభలలో, ప్రార్థనా మందిరాలలో, పెద్దపెద్ద సాక్ష్యాలు చెప్పేవారిలో కొందరు వారి జీవితకాలంలో ఒక్కరికి కూడ వ్యక్తిగత సువార్త చెప్పి, ప్రభువు దగ్గరకు నడిపించే భారము వహించినవారు కారు! ఎంతసేపూ ఆర్థిక, ఆరోగ్య, కుటుంబ దీవెనలు పొందుకుందామని చెప్పేవారే తప్ప, నేను ప్రభువు దగ్గరకు కొంతమందిని నడిపించాను, మా కుటుంబాలలో గొప్ప సాక్షిగా నేనున్నాను, దేవునికి విరుద్ధమైన నా హృదయాలోచనలను మార్చుకున్నాను అని సాక్ష్యము చెప్పేవారు కరువయ్యారు. కాని వారి బాధ్యతను మరచి, సర్వలోకము విమోచింపబడాలని ప్రార్థన చేస్తున్నారు. అటువంటివారు ప్రార్థనతోబాటు ప్రభుని యాజ్ఞకులోబడి, ఆయన చెప్పింది చేస్తే, గొప్ప సేవ జరిగి ఉండేది. ఇప్పటికైనా క్రియాశూన్య వచనాలు, వేషధారణలు, అలవిమాలిన ఆర్భాటాలు మాని, క్రీస్తు ప్రభుని ఆజ్ఞలను అనుసరిస్తూ, ఆత్మతో ఆయనను ప్రార్థిస్తూ, సువార్తను, క్రీస్తు ప్రభునిలో ఉన్న స్వేచ్ఛా, శాంతి సమాధానాలను, త్యాగపూరితమైన ఆయన ప్రేమను, ఆత్మీయానందాలను చవిచూపించాలి.

– మరనాత (సశేషం)

## దేవతలకు, యేసుక్రీస్తుకు గల కొన్ని వ్యత్యాసములు



బ్రదర్ ఎస్.ఆర్.తిరుగుళ్ల
చర్చ్ ఆఫ్ క్రైస్ట్
చీపురుపల్లి, విజయనగరం.

| దేవతలు | యేసుక్రీస్తు |
|---|---|
| 1. దేవ(దూ)తలు మొదటి నుండి పాపము చేసిరి (మత్తయి 25:41, ప్రకటన 12:8, 2పేతురు 2:4,11, 1యోహాను 3:8) | 1. యేసుక్రీస్తు పాపము చేయలేదు.(1 పేతురు 2:22) |
| 2. దేవ(దూ)తలు పాపము చేసి పాతాళ లోకములోనికి త్రోయబడిరి (2 పేతురు2:4) | 2. యేసుక్రీస్తు పాపరహితునిగా జీవించి మరణమును జయించి తిరిగి లేచెను (1కొరింథీ.15:3) |
| 3. పాపము చేయుటకు ప్రేరేపించుటయే దేవ(దూ)తల పని. (1 యోహాను 3:12) | 3. పాపములను తీసివేయుటకు యేసుక్రీస్తు ప్రత్యక్షమాయెను. (1 యోహాను 3:5) |
| 4. దేవ(దూ)తల యందు జీవమునకు బదులు చీకటి, అనగా మరణముగలదు. మత్తయి 25:41 | 4. యేసుక్రీస్తు నందు జీవము ఉంచబడియున్నది (1 యోహాను 5:11) |
| 5. దేవ(దూ)తలు మానవుని కంటె కొంచెము ఎక్కువ. (హెబ్రీ 2:7) | 5. యేసుక్రీస్తు దేవ(దూ)తల కంటె శ్రేష్ఠుడు. (హెబ్రీ 1:4) |

**(దేవతలు, దేవదూతలు మున్నగునవి భాషాంతర పర్యాయపదములు)**

2018 మార్చి 1-15

క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



# తిండిపోతుతనము

**'నాశనమే వారి అంతము, వారి కడుపే వారి దేవుడు; వారు తాము సిగ్గుపడవలసిన సంగతులయందు అతిశయపడుచున్నారు, భూసంబంధమైన వాటియందే మనస్సు నుంచుచున్నారు.'** - ఫిలిప్పీ. 3:17-19

కొందరు దేవునికంటె ఆహారమును ఎక్కువగా ప్రేమిస్తున్నారు. వారి కడుపే వారికి దేవుడైపోయాడు. సిగ్గుపడవలసిన విషయములలో అతిశయపడుతు భూసంబంధమైన వాటియందు లక్ష్యముంచుతూ సిలువకు శత్రువులుగా మారిపోతున్నారు. నాశనమే వారి అంతమని పౌలు భక్తుడు అట్టివారి కొరకు ఏడుస్తున్నాడు. నన్నుపోలి మీరు నడుచుకొనుడని హెచ్చరిస్తున్నాడు. మన పౌరస్థితి పరలోకమందున్నదని తెలుసుకొని భూసంబంధమైన వాటియందు లక్ష్యముంచకుండ శాశ్వతుడు, నిత్యుడైన దేవునియందే లక్ష్యముంచి సిలువకు మిత్రులుగా నడుచుకొమ్మని చెపుతున్నాడు.

**'మన పౌరస్థితి పరలోకమునందున్నది; అక్కడనుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీన శరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగలదానిగా మార్చును.'**

- ఫిలిప్పీ 3:20,21

శరీరమును, ఆత్మను గూర్చి ఒక దృష్టాంతము మీముందు ఉంచుతాను. పంజరము, పంజరములో ఉండే పక్షివలె మనమున్నాము. శరీరమనే పంజరములో దేవుడనుగ్రహించిన పరిశుద్ధాత్మ నివసిస్తుంది. ఆత్మ తప్పకుండ ఏదో ఒకరోజు ఈ శరీరమును విడిచి దేవుని యొద్దకు వెళ్లిపోతుంది. పంజరమును వదిలి స్వేచ్ఛగా ఆకాశములో విహరించడమే పక్షికి ఆనందమిస్తుంది. శరీరమనే ఈ పంజరమును ఎంత దృఢపరచుకొన్నా ఎంత బలమైన ఆహారము తీసికొని బలపరచినా ఆత్మ శరీరమును వదిలిపోవలసిందే. మన పౌరస్థితి పరలోకమందున్నదని గ్రహించి బాహ్య పురుషుడు కృశించినా అంతరంగ పురుషుని బలపరచాలి. అందుకే పౌలు భక్తుడు - నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే; చావైతే లాభమని అంటాడు. శరీరమును ప్రేమించి దానిని బలపరచుకోవడము తప్పుకాదు గాని శరీర కార్యములను విసర్జించి ఆత్మయందు తీవ్రత కలిగి ఆసక్తితో దేవుని సేవించాలని అర్థము. నీవు దేవుని ప్రేమిస్తే ఆయనే నీ ప్రాణాత్మ దేహములను కాపాడుతాడు.

అందుకే ఏమి తిందుమో? ఏమి త్రాగుదుమో? అని చింతించవద్దని యేసు ప్రభువు అంటున్నాడు. అరచు పిల్ల కాకులకు ఆహారమిచ్చే దేవుడు ఆకాశపక్షులను పోషించే దేవుడు నిశ్చయముగా నీకు కావలసినవన్నీ అనుగ్రహిస్తాడు. మొదట దేవుని నీతిని రాజ్యమును వెదకాలి. దేవుని వెదికే జ్ఞానము నీకుండాలి. కొందరికి ఉదయం నిద్ర లేచి మొదట దేవుని సన్నిధిలో కొద్ది సమయమైనా గడపాలనే తెలివి ఉండదు. దేవుని వెదకువారు ఆయనను కనుగొంటారు.

**'కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును.'**

- మత్తయి 6:33

ఒక ధనవంతుడు తన ప్రాణముతో - ప్రాణమా తినుము, త్రాగుము, సుఖించుము అనేక సంవత్సరములకు సరిపడినంత సంపాదించాను అంటున్నాడు. దేవుడతని వెఱ్ఱివాడా, అని సంబోధిస్తు ఈ రాత్రి నీ ప్రాణము పోతే నీవు సంపాదించినవన్ని ఎవరి వశమవుతాయి అంటున్నాడు. ఈ లోకరీతిగా తిని, త్రాగి సంతోషించేవారు దరిద్రులవుతారు.

**'త్రాగుబోతులును తిండిపోతులును దరిద్రులగుదురు. నిద్రమత్తు చింపిగుడ్డలు ధరించుటకు కారణమగును.'** - సామెతలు 23:21

ఆహారము మితముగా తీసికొని (ఉపవాసముతో) ప్రార్థనలో గడిపేవారు తప్పక ఐశ్వర్యవంతులవుతారు. త్రాగుబోతులు, తిండిపోతులు దరిద్రులవుతారు. నిద్రమత్తు చింపిరి గుడ్డలు ధరించుటకు కారణమవుతుంది. అందుకే మితిమీరి అతిగా తినే అలవాటుంటే మానుకోవాలి.

**'ద్రాక్షారసము త్రాగువారితోనైనను మాంసము హెచ్చుగా తినువారితోనైనను సహవాసము చేయకుము.'** - సామెతలు 23:20

కొందరికి మాంసాహారము లేనిది ముద్ద దిగదు. ప్రతిరోజు మాంసము వండాల్సిందే. లేకుంటే ఇంట్లో గొడవ చేస్తారు. మాంసమధికముగా తింటే శరీరములో క్రొవ్వు పెరిగిపోతుంది; విసకరమైన పదార్థములు తయారై నిన్ను వ్యాధిగ్రస్తుని చేస్తాయని వైద్యశాస్త్రము చెపుతుంది. శాకాహార భోజనమే శరీరమునకు మేలు చేస్తుంది. అది అన్ని విధముల శ్రేయస్కరమని వైద్యులు చెపుతారు.

**'నీవు తిండిపోతువైనయెడల నీ గొంతుకను కత్తి పెట్టుకొనుము.'** - సామెతలు 23:2

జ్ఞానియైన సొలొమోను తిండిపోతులను హెచ్చరిస్తున్నాడు. నీవు తిండిపోతువైన యెడల నీ గొంతుకను కత్తిపెట్టుకోమంటున్నాడు. అంటే నిన్ను నీవు నియంత్రించుకొని అతిగా తినే అలవాటును అదుపు చేసికోవాలని అర్థము. ఎవరైనా నీ గొంతు మీద కత్తిపెట్టి చంపుతానని బెదిరిస్తుంటే నీకు ఆహారముపై ధ్యాస ఉంటుందా? తప్పించుకొని నా ప్రాణము కాపాడుకుంటే చాలనుకుంటావు. అలాగునే నీవు ఆరోగ్యముతో ఎక్కువకాలము జీవించాలంటే ఆహారము అతిగా తినకుండ మితముగ తీసుకోవాలి.

**'ఎదుటివాని మేలు ఓర్వలేనివానితో కలిసి భోజనము చేయకుము. వాని రుచిగల పదార్థముల నాశింపకుము.'** - సామెతలు 23:6

అసూయపరునితో, నీ మేలు ఓర్వలేని వానితో కలిసి భోజనము చేయకు. వాని రుచిగల పదార్థములు ఆశించకు అని హెచ్చరిస్తున్నాడు.

**'అట్టివాడు తన అంతర్యములో లెక్కలు చూచుకొనువాడు. తినుము త్రాగుము అని అతడు నీతో చెప్పునేగాని అది హృదయములోనుండి వచ్చుమాట కాదు. నీవు తినినను తినినదానిని కక్కివేయుదువు.'** - సామెతలు 23:7,8

కొన్నిసార్లు కొందరు నిన్ను భోజనమునకు ఆహ్వానిస్తారు. పైకి చాలా తీయగా మాట్లాడుతారు గాని హృదయములో నీపై ప్రేమ ఉండదు. ఇంకొక చపాతి వేసుకోండి అంటూ ఉంటారు గాని హృదయములో అమ్మో ఎంత తిన్నాడని లెక్కలు వేసుకుంటారు. అలాంటి వారితో కలిసి భోజనము చేయవద్దు. నీవు తింటే కూడ తినినదానిని కక్కివేస్తావు. నీకు కీడు కలుగుతుంది అంటున్నాడు. ఎదుటివాని మేలు ఓర్వలేని వాని రుచిగల పదార్థములు ఆశింపకుండ నీవు గొంతుకకు కత్తి పెట్టుకోవాలి.

**'పేదరికమునైనను ఐశ్వర్యమునైనను నాకు దయచేయకుము. తగినంత ఆహారము నాకు అనుగ్రహింపుము. ఎక్కువైనయెడల నేను కడుపు నిండినవాడనై నిన్ను విసర్జించి - యెహోవా ఎవడని అందునేమో.'** - సామెతలు 30:8,9

తగినంత ఆహారము నాకు దయచేయి, ఆహారము ఎక్కువైతే కడుపు నిండినవాడనై దేవుడు ఎవరని అంటానేమో, దేవుని విసర్జించకుండ తగినంతే దయచేయుమని ప్రార్థన చేస్తున్నాడు. తక్కువ ఆహారము తీసికుంటూ - నిద్రమత్తు, సోమరితనము, తిండిపోతుతనమును తొలగించుకొని దేవుని సన్నిధిలో గడపడము ఎంతో ఆశీర్వాదకరమైనది. ఎక్కువగా తిని కడుపు నిండిన తరువాత - దేవుడెవరు? దేవునితో నాకేమిటి అనే దుర్గతి పట్టక ముందే వాక్యపు వెలుగులో నిన్ను నీవు సరిచేసుకొని తిండిపోతుతనమును తొలగించుకోవాలి.

కొందరు సుఖాసక్తి కలిగిన వారుంటారు. ఇహలోక సౌఖ్యాలను ప్రేమిస్తూ దేవుని మరచిపోతారు. అట్టివారికి రాబోయే ఉపద్రవమును గూర్చిన చింత ఉండదు.

**'దంతపు మంచములమీద పరుండుచు, పాన్పులమీద తమ్మును చాచుకొనుచు, మందలో శ్రేష్ఠమైన గొఱ్ఱెపిల్లలను సాలలోని క్రొవ్విన దూడలు వధించి భోజనము చేయుదురు. స్వరమండలముతో కలిసి పిచ్చిపాటలు పాడుచు, దావీదువలెనే వాయించు వాద్యములను కల్పించుకొందురు. పాత్రలలో ద్రాక్షారసముపోసి పానము చేయుచు పరిమళ తైలము పూసికొనుచుందురు గాని యోసేపు సంతతివారికి కలిగిన ఉపద్రవమును గురించి చింతపడరు.'** - ఆమోసు 6:4-6

ఇశ్రాయేలు ప్రజలు దేవుడు అనుగ్రహించిన మన్నాను తింటున్నాడు. మన్నా అనుగ్రహించినందుకు కృతజ్ఞత లేదు గాని మాంసము లేదని సణుగుతున్నారు. దేవుడు వారు కోరిన మాంసమిచ్చాడు గాని అది వారు నమలకమునుపే దేవుని ఉగ్రతకు గురయ్యారు.

**'వారి మధ్యనున్న మిశ్రితజనము మాంసాపేక్ష అధికముగా కనుపరచగా ఇశ్రాయేలీయులును మరల ఏడ్చి - మాకెవరు మాంసము పెట్టెదరు?'** - సంఖ్యా కాం. 11:4

**'ఆ మంసము ఇంక వారి పండ్ల సందున నుండగానే, అది నమలకమునుపే, యెహోవా కోపము జనులమీద రగులుకొనెను; యెహోవా తెగులు చేత వారిని బహుగా బాధించెను.'** - సంఖ్యాకాం. 11:33

దైవభయము కలిగి తిండిపోతుతనము తొలగించుకొని మన శరీరములను పరిశుద్ధముగ దేవునికి అనుకూలమైన సజీవయాగముగా సమర్పించుకోవాలి. తిండిపోతువైతే నీ శరీరమును నియంత్రించుకొని నీ స్వాధీనములో ఉంచుకోవాలి. ఆహారము కంటే దేవుని ఎక్కువగా ప్రేమించాలి.

**'పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడి.'** - రోమా 12:1

శరీరమును నియంత్రించుకోలేక దేవుని కంటే ఆహారమును ప్రేమించి ఒక్కపూట కూటికొరకు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్ముకున్న ఏశావు వంటి భ్రష్టులుగా ఉండకుండ జాగ్రత్తపడుమని పౌలు భక్తుడు హెచ్చరిస్తున్నాడు. చిక్కుడుకాయల వంటకము కొరకు దేవుని ఆశీర్వాదమును పోగొట్టుకున్నాడు.

**'ఒక్క పూట కూటికొరకు తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్మివేసిన ఏశావువంటి భ్రష్టుడైనను వ్యభిచారియైనను ఉండునేమో అనియు, జాగ్రత్తగా చూచుకొనుడి. ఏశావు ఆ తరువాత ఆశీర్వాదము పొందగోరి కన్నీళ్లు విడుచుచు దానికొరకు శ్రద్ధతో వెదకినను, మారుమనస్సుపొంద నవకాశము దొరకక విసర్జింపబడెనని మీరెరుగుదురు.'** - హెబ్రీ 12:16,17

దేవుడు నీకనుగ్రహించిన ఆశీర్వాదములన్నీ జాగ్రత్తగా కాపాడుకోవాలి. నిన్ను నశింపజేసే పాపమేదైనా దానిని తొలగించుకోవాలి. ఒక్కపూట ఆహారము కొరకు ఏశావు జ్యేష్ఠత్వపు హక్కు కోల్పోయాడు. వాక్యము ధ్యానిస్తున్న మీలో తిండిపోతులుంటే ఇప్పటి నుండి తక్కువగా తిని ఎక్కువగా ప్రార్థన చేస్తే ఏ కీడులో పడకుండ దేవుడు కాపాడుతాడు.

నీకు కడుపు నిండా ఆహారము లభించినప్పుడు, తిండిలేక ఆకలితో అలమటిస్తున్న వారిని జ్ఞాపకము చేసుకోవాలి. ప్రపంచములో 60% మందికి సరియైన పోషకాహారము లభించడము లేదు. సోమాలియా దేశములో ప్రజలు ఆహారము కొరకు అలమటిస్తున్నారు. వారిని చూస్తే బక్కచిక్కి డొక్కంతా లోపలికి పోయి కనపడతారు. కాబట్టి దేవుడు నిన్ను సమృద్ధిగా దీవించినప్పుడు నీ ఆహారములో కొంత దరిద్రునికివ్వాలి. అట్టివాడు దీవెన పొందుతారు. నీవే అతిగా తిని నీ శరీరము రోగములపాలు చేసేకంటే, నీవు మితముగా తిని నీ ఆహారము నీ ముందుకు వచ్చినప్పుడు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి. ప్రార్థన చేసి ఆహారము తినాలి.

**'దయాదృష్టిగలవాడు తన ఆహారములో కొంత దరిద్రునికిచ్చును అట్టివాడు దీవెన నొందును.'**

- సామెతలు 22:9

చైనాలో కొన్ని కప్పలు బాగా తిని పొట్టపగిలి చనిపోతాయట. చావడానికే అవి తింటాయి. విశ్వాసి ఆలాగుండకూడదు. బ్రతకడానికి తినాలి కాని తినడానికే బ్రతకకూడదు. తిండి మీద కంటే దేవుని కార్యముల మీద ఆసక్తి కలిగియుండాలి. నీ దేహమును ఆత్మీయ జీవితమును పాడుచేసే తిండిపోతుతనమును తొలగించుకోవాలి. ఆహారపు అలవాట్లు అదుపులో పెట్టుకొని ఆరోగ్యము కాపాడుకోవాలి. శరీరమును నియంత్రణలో ఉంచుకోవాలి. అధికముగా తిని మందకొండిగా ఉండి దేవుని శిక్షకు లోనవకుండ తక్కువగా తిని ఎక్కువగా దేవుని వెదకాలి.

ప్రార్థన : ప్రభువా, నా దేహమును చెరిపి రోగములపాలు చేసే తిండిపోతుతనమును మాలో నుండి తొలగించుకోవడానికి సహాయం చేయండి. నిగ్రహశక్తి దయచేయుమని యేసు నామములో అడుగుతున్నాము తండ్రీ. ఆమెన్!

## ఇద్దరు లేక ముగ్గురు!

**నా చిన్నప్పుడు ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు చాలన్నది ఎక్కువగా వినేవారం, సిని మాల్లోనూ, వీధుల్లోనూ దాని తాలూక ప్రకటనలు చూసేవారం. ఇప్పుడేమో సేవకులకు ఇద్దరు లేక ముగ్గురు పెళ్లాలని వింటున్నాం. ఇది కడు ధౌర్భాగ్యమంటున్నారు దేవుని వాక్యాన్ని తమ జీవనంలో చూపేవారు**

**- బ్రదర్ వై.కనకరాజు, హోలీ బైబిలిస్ట్.**










విశాఖపట్నం

## చర్చ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారి

# సేవకుల సదస్సు


**విశాఖపట్నం :** రెవ.కుమార్ దాస్ వక్తగా 'చర్చ్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో సేవకుల సదస్సు జరిగింది. విశాఖలో ప్రముఖుల్లో ఒకరైన డా.లూక్ 'జీసస్ హీల్స్ చర్చ్' అందుకు వేదికైంది. కార్యక్రమం జరిగేందుకు సహకరించారు. వారి ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ సదస్సులో సేవ చేయుటలో సాధక బాధకాలను, మెళకువలను తెరమీద చూపుతూ రెవ.కుమార్ దాస్ వివరించారు. ఉదయ సాయంకాలాలు స్నాక్స్‌తోబాటు మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేసారు. ముగింపులో డా.లూక్ సేవకులకు హెచ్చరికలతోబాటు సేవకు అవసరమైన సూచనలు చేసారు.


డా.లూక్


రెవ.కుమార్ దాస్



## విజయనగరం సిమ్స్ చర్చ్‌లో సిలువ శక్తి మహోత్సవములు












14-02-2018 నుండి 1-04-2018 వరకు సిమ్స్ సంఘంలో లెంట్ డేస్ ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనే అవకాశముంది.

**పాస్టర్ & హా. ప్రెసిడెంట్ : రెవ.ఎం.జోసఫ్ ప్రకాశ్,**
**సెక్రటరీ : సంఘమిత్ర డా.ఆర్.ఎస్.జాన్,**
**ట్రెజరర్ : రెవ.ఎం.ఎ.నాయుడు**



Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 13 - 237, Ambedkar Nagar, Old Police Station Center, Nr.TIC Point, Arilova, Visakhapatnam - 530 040, Andhra Pradesh State, INDIA. Ph : 9346960601,9866113513. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at JC Printers, Ambedkar Nagar, Arilova, Visakhapatnam - 40.